# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 26, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ ఆదివారం -25- మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


8 రోజుల ముందే దేశంలోకి ప్రవేశం

## కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు..



అంచనాల కంటే ముందుగానే రుతుపవనాలు రావడం 16 ఏళ్లలో ఇదే తొలిసారి చివరిసారిగా 2009లో మే 23నే కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు

2

పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల పథకం..

## అభ్యంతరం తెలిపిన తెలంగాణ



గోదావరి బోర్డు, పీపీఏకు తెలంగాణ ఇంజనీర్ ఇన్ చీఫ్ లేఖ కేంద్ర జలసంఘం అనుమతులు లేవన్న తెలంగాణ గోదావరి డెల్టా ప్రయోజనాలకు నష్టమని ఆందోళన

ఉగ్రవాద దాడుల్లో 20వేల మంది

## భారతీయుల మృతి..

ఐక్యరాజ్యసమితిలో మరోమారు పాక్‌ను ఎండగట్టిన భారత్

2లో



- ★సింధు జలాల ఒప్పందంపై పాకిస్థాన్ తప్పుడు సమాచారం ఇచ్చిందన్న భారత్
- ★పాక్ ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదం కారణంగానే 65 ఏళ్ల నాటి ఒప్పందాన్ని నిలిపివేసినట్లు వెల్లడి

# తెలంగాణ రైజింగ్-2047కు కేంద్రం సహకారం అవసరం

మా ఆకాంక్షలు, దృఢ సంకల్పానికి ఈ రోడ్డు మ్యాప్ ప్రతిబింబం

- సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పని చేయాలని మేం ఆకాంక్షిస్తున్నాం
- దేశ పురోభివృద్ధి ప్రతి రాష్ట్రం కేంద్ర పాలిత ప్రాంతం అభివృద్ధితో ముడిపడి ఉంటుంది



ఢిల్లీ: వికసిత్ భారత్ కు అనుగుణంగా 'తెలంగాణ రైజింగ్ 2047' అనే నినాదంతో మా రాష్ట్ర కార్యచరణ పథకాన్ని సమర్పిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన మిగతా.. 2లో




## కేంద్రం, రాష్ట్రాలు టీం ఇండియాలా కలిసి పనిచేస్తే.. ఏ లక్ష్యం అసాధ్యం కాదు

- దేశాభివృద్ధిలో అన్ని రాష్ట్రాలు భాగస్వామ్యం కావాలి
- 'అభివృద్ధిలో వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉంది
- పాలక మండలి సమావేశం థీమ్ 'వికసిత్ భారత్ కోసం వికసిత్ రాజ్యం@2047'
- "వికసిత్ భారత్ అనేది ప్రతి భారతీయుడి లక్ష్యం
- నీతి ఆయోగ్ లో ప్రధాని మోదీ

### మీ రాష్ట్రంలో కనీసం ఒక వరల్డ్ క్లాస్ టూరిస్ట్ ప్లేస్ డెవలప్ చేయండి: ప్రధాని మోదీ



ఇంటర్నెట్ డెస్క్: మీమీ రాష్ట్రాల్లో కనీసం ఒక్కో వరల్డ్ క్లాస్ టూరిస్ట్ ప్లేస్ ఏర్పాటు చేయండని దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రధాని మోదీ సూచించారు. సదరు పర్యాటక కేంద్రాన్ని ప్రపంచ ప్రమాణాల ప్రకారం అభివృద్ధి చేయాలని మోదీ అన్నారు. మనం కలిసి పనిచేస్తే ఏదీ అసాధ్యం కాదన్న ప్రధాని మోదీ.. కేంద్ర రాష్ట్రాలు కలిసి చేస్తే ఏ లక్ష్యం అసాధ్యం కాదని నొక్కి చెప్పారు. (శనివారం) ఢిల్లీలో నిర్వహించిన నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.'వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్@2047' అనే అంశంపై నేడు (మే 24)న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 10వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు. "మనం అభివృద్ధి వేగాన్ని పెంచాలి. కేంద్రం, అన్ని రాష్ట్రాలు మిగతా.. 2లో

# కరోనా కలవరం

## అప్రమత్తమైన ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్..ప్రభుత్వాలు

దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

భారత్‌లో ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 కొత్త వేరియంట్ల గుర్తింపు

ఢిల్లీ, ఏపీ, కర్ణాటకలో ఆసుపత్రుల సన్నద్ధతకు ప్రభుత్వాల చర్యలు

ఆసియా దేశాల్లో జేఎన్.1 వేరియంట్‌తో అధిక వ్యాప్తి

లక్షణాలు స్వల్పమే, ఆందోళన వద్దంటున్న నిపుణులు



ఢిల్లీ: కరోనా మహమ్మారి పూర్తిగా అంతమైందని భావిస్తున్న తరుణంలో, దేశంలో మళ్లీ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై ఆసుపత్రులను సిద్ధం మిగతా.. 2లో



2

### 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు.. నీతి ఆయోగ్ భేటీలో చంద్రబాబు

వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రపై నివేదిక


చంద్రబాబు ప్రజంటేషన్‌లోని వివిధ అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ప్రధాని మోదీ

# ఢిల్లీ పర్యటనపై చంద్రబాబు బ్రీఫింగ్...!

ఢిల్లీలో కేంద్రమంత్రులతో ఏపీ సీఎం చంద్రబాబు సమావేశాలు



- మీడియాకు వివరాలు తెలిపిన చంద్రబాబు
- ఏపీ సమగ్రాభివృద్ధిపై కేంద్రమంత్రులతో చర్చించినట్టు వెల్లడి
- పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు, నిధుల సమీకరణ
- రక్షణ రంగంలో ఏపీని బలోపేతం చేసే దిశగా అడుగులు



అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్రమంత్రులతో కీలక సమావేశాల అనంతరం మీడియాకు వివరాలు తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో, అమరావతిని రాజధానిగా పునర్విభజన చట్టంలో చేర్చి నోటిఫై చేయాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. ఏపీ సమగ్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

**గత ప్రభుత్వ తీరుపై ఆరోపణలు, పునర్నిర్మాణ యత్నాలు**

2019 నుంచి 2024 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర విధ్వంసం జరిగిందని చంద్రబాబు ఆరోపించారు. వైకాపా హయాంలో జరిగిన నష్టం నుంచి రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టడానికి కనీసం పదేళ్ల సమయం పడుతుందని ఆయన మిగతా.. 2లో



2

### 427 మంది రోహింగ్యాలు జలసమాధి? సముద్రంలో మునిగిన రెండు ఓడలు..

మయన్మార్ తీరంలో రెండు ఓడలు మునిగి ఘోర ప్రమాదం

# 'సిస్టర్ స్ట్రోక్'తో కేటీఆర్ చిన్న మెదడు దెబ్బతిన్నది

- కవిత చెప్పిన ఆ దెయ్యం కేటీఆరే కావొచ్చు
- కాళేశ్వరం కమీషన్ల విషయంలో ఇప్పుడు భయమెందుకని ప్రశ్న
- కేటీఆర్‌కు గోబెల్స్ అవార్డు ఇవ్వాలంటూ వ్యంగ్యం



- అబద్ధాలతో బీఆర్ఎస్ పార్టీ మనుగడ సాగిస్తోందని ఆరోపణ
- రాహుల్, రేవంత్‌లపై విమర్శలు మానుకోవాలి

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర పంచాయతీరాజ్, మిగతా.. 2లో

# బీఆర్ఎస్ పై నిందలు.. బిల్డర్లతో దందాలు.. ఢిల్లీ పెద్దలకు చందాలు..

## రేవంత్ పాలనపై మండిపడ్డ కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ సంపదను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి దోచిపెడుతున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటీఎంగా మారిందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలన 'బీఆర్ఎస్ పై నిందలు.. బిల్డర్లతో దందాలు.. ఢిల్లీ పెద్దలకు చందాలు' అన్న చందంగా నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి కాదు మూటల మనిషి అని ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారని, అది నిజమని తాజాగా తేలిందని చెప్పారు. ఢిల్లీకి మూటలు మోసి పదవులు కొనుక్కున్నాడని, పీసీసీ చీఫ్ పదవి మిగతా.. 2లో

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక



### 427 మంది రోహింగ్యాలు జలసమాధి?

# సముద్రంలో మునిగిన రెండు ఓడలు..

మయన్మార్ : మయన్మార్ తీర ప్రాంతంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులతో వెళ్తున్న రెండు ఓడలు మునిగిపోయాయి. ఈ ఘోర దుర్ఘటనల్లో సుమారు 427 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని ఐక్యరాజ్య సమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వార్త నిజమైతే, ఇటీవలి కాలంలో సముద్రంలో జరిగిన అతి పెద్ద విషాదాల్లో ఒకటిగా ఇది నిలిచిపోతుందని ఐరాస పేర్కొంది. ఐక్యరాజ్య సమితి అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మే 9వ తేదీన జరిగిన మొదటి ప్రమాదంలో ఒక నౌక మునిగిపోయింది. ఇందులో ప్రయాణిస్తున్న 267 మందిలో కేవలం 66 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడి ఉంటారని తెలిపింది. మిగిలిన వారు గల్లంతయ్యారు. ఆ తర్వాత మే 10వ తేదీన మరో నౌక కూడా ఇదే విధంగా ప్రమాదానికి గురైంది. ఈ రెండో నౌకలో ఉన్న వారిలో 21 మంది మాత్రమే సురక్షితంగా ఒడ్డుకు చేరారని సమాచారం. ఈ రెండు ఘటనల్లో కలిపి మొత్తం 427 మంది మరణించి ఉండవచ్చని ఐరాస అంచనా వేస్తోంది. ఈ ప్రమాదాలకు గల కచ్చితమైన కారణాలపై ఐరాసకు అనుబంధంగా పనిచేస్తున్న శరణార్థి విభాగం విశ్లేషణ జరుపుతున్నట్లు సమాచారం. మయన్మార్‌లో నివసించే రోహింగ్యాలు అనేక సంవత్సరాలుగా వివక్షకు, హింసకు గురవుతున్నారు. 2017లో మయన్మార్ సైన్యం చేపట్టిన కఠిన చర్యల కారణంగా లక్షలాది మంది రోహింగ్యాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కు వలస వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అయితే, గత ఏడాది మయన్మార్‌లో సైనిక తిరుగుబాటు జరిగిన అనంతరం, రోహింగ్యాలపై దాడులు, అణచివేత మరింత పెరిగాయని వార్తలు వస్తున్నాయి. దీంతో, బంగ్లాదేశ్‌లోని శిబిరాల్లో ఇప్పటికే కిక్కిరిసిపోయిన జనాభా, అక్కడి దుర్భర పరిస్థితుల కారణంగా అనేకమంది రోహింగ్యాలు ఇతర దేశాలకు వలస వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే, వారు ఏజెంట్ల మాటలు నమ్మి, ప్రమాదకరమైన సముద్ర మార్గాల ద్వారా ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలకు చేరుకోవాలని చూస్తున్నారు. ఇలాంటి ప్రయాణాల్లోనే తరచూ ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

## రాహుల్ గాంధీకి నాన్ బెయిలబుల్ వారెంట్

ఢిల్లీ: లోక్ సభ ప్రతిపక్ష నేత, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి జార్ఖండ్‌లోని చైబాసా ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2018 నాటి పరువు నష్టం దావా కేసులో ఈ వారెంట్ ఇచ్చింది. జూన్ 26న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని రాహుల్ గాంధీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రాహుల్ గాంధీ తరపు న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

### రాహుల్ పై కేసు ఇదే..

2018లో కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. "హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి కూడా బీజేపీకి అధ్యక్షుడు కాగలడు" అని రాహుల్ వ్యాఖ్యానించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యాఖ్యలు బీజేపీ కార్యకర్తలందరినీ అవమానించేలా ఉన్నాయని, పరువు నష్టం కలిగించాయని ఆరోపిస్తూ బీజేపీ నేత ప్రతాప్ కతియార్ 2018 జులై 9న చైబాసా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (సీజేఎం) కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తదనంతర కాలంలో, జార్ఖండ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పరువు నష్టం కేసును 2020 ఫిబ్రవరిలో రాంచీలోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ చేశారు. ఆ తర్వాత మళ్లీ ఈ కేసు చైబాసాలోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ అయింది. ఈ కేసును విచారణకు స్వీకరించిన మేజిస్ట్రేట్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేశారు.

### కోర్టుకు హాజరు కాని రాహుల్..

కోర్టు పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ రాహుల్ గాంధీ విచారణకు హాజరుకాలేదు. దీంతో తొలుత ఆయనపై బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ వారెంట్‌పై స్టే విధించాలని కోరుతూ రాహుల్ గాంధీ జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను 2024 మార్చి 20న హైకోర్టు కొట్టివేసింది. అనంతరం, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా చైబాసా కోర్టు తిరస్కరించింది. తాజాగా, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించిన ప్రత్యేక న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ, జూన్ 26న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.

## యాపిల్‌నేకాదు.. శాంసంగ్‌నూ టార్గెట్ చేసిన ట్రంప్

## అమెరికాలోనే ఫోన్లను తయారు చేయాలి

అమెరికా: ప్రముఖ ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ కి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. అమెరికాలోనే ఫోన్లను తయారు చేయాలని చెప్పారు. లేదంటే 25శాతం సుంకాన్ని విధిస్తామంటూ తీవ్రంగా హెచ్చరించారు. అయితే, మరో దిగ్గజ మొబైల్ ఉత్పత్తుల సంస్థకు కూడా ట్రంప్ ఇదే తరహా హెచ్చరికలు చేశారు. యాపిక్ ప్రత్యర్థి, దక్షిణ కొరియాకు చెందిన దిగ్గజ మొబైల్ సంస్థ శాంసంగ్ తమ ఉత్పత్తులను అమెరికాలోనే తయారు చేయాలని స్పష్టం చేశారు. లేదంటే 25 శాతం దిగుమతి సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికాలో పరికరాలను విక్రయించే ఏ మొబైల్ తయారీ సంస్థకైనా ఈ టారిఫ్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. 'యాపిల్ ఒక్కటే కాదు.. శాంసంగ్ అయినా.. ఇంకే సంస్థ అయినా తమ ఉత్పత్తులను అమెరికాలోనే తయారు చేయాలి. అలాకాకుండా ఇతర దేశాల్లో ఉత్పత్తి చేసినవి తీసుకొస్తే మాత్రం అది అన్యాయమైన ప్రక్రియ. అమెరికాలో పరికరాలను విక్రయించే ఏ మొబైల్ తయారీ సంస్థ అయినా.. ఇక్కడ ప్లాంట్ నిర్మిస్తే ఎలాంటి టారిఫ్‌లు ఉండవు. లేదంటే 25 శాతం దిగుమతి సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. దక్షిణ కొరియాకు చెందిన దిగ్గజ మొబైల్ సంస్థ శాంసంగ్.. అమెరికా మార్కెట్లో నంబరు 2 విక్రేతగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఈ కంపెనీ ఏటా 220 మిలియన్ ఫోన్లను విక్రయిస్తుండగా.. ఇందులో 60శాతం మొబైల్స్‌ను వియత్నాంలో ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి నుంచే ఎక్కువగా అమెరికాకి ఎగుమతి అవుతున్నాయి. మరోవైపు కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం.. 2024లో భారత్‌లో తయారు చేసిన మొత్తం స్మార్ట్‌ఫోన్లలో యాపిల్, శాంసంగ్ 94 శాతం వాటా కలిగి ఉన్నాయి. 2025 మార్చి త్రైమాసికంలో భారత్‌లో శాంసంగ్ మార్కెట్ వాటా 17 శాతంగా ఉంది.

### పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి


### ఎత్తిపోతల పథకం.. అభ్యంతరం తెలిపిన తెలంగాణ

హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రతిపాదనలపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ గోదావరి బోర్డుతోపాటు, పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖ రాశారు. ఎత్తిపోతల పనులు ఆపినట్లు ఏప్రిల్ 8న జరిగిన పీపీఏలో పోలవరం చీఫ్ ఇంజనీర్ తెలిపినా.. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఏపీ సిద్ధమైందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర జల సంఘం అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని, దీనివల్ల గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వాటిల్లుతుందని లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోయడం సబబు కాదని అన్నారు. తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకూ నీటి లభ్యత లేదంటూ ఏపీ ప్రభుత్వం అభ్యంతరం చెబుతోందని, మరోవైపు ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్ స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం సబబు కాదని అనిల్‌కుమార్ లేఖలో పేర్కొన్నారు. డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం సీడబ్ల్యూసీ అనుమతులకు విరుద్ధమని తెలంగాణ వాదిస్తోంది. సీడబ్ల్యూసీ వెంటనే జోక్యం చేసుకొని ఏపీని అడ్డుకోవాలని అనిల్‌కుమార్ కోరారు. పోలవరం నుంచి ఎత్తిపోతల చేపట్టకుండా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు గతంలో కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు కూడా ఇది విరుద్ధంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టుపై ఏపీ ముందుకు వెళ్లకుండా నిలువరించాలని కోరారు.

## 8 రోజుల ముందే

# దేశంలోకి ప్రవేశం

## కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు..



ఢిల్లీ: భారత వాతావరణ విభాగం (ఐఎండీ) దేశ ప్రజలకు చల్లని కబురు అందించింది. దేశంలో వ్యవసాయానికి ఊతమిచ్చే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. ఈ ఏడాది సాధారణం కంటే ఎనిమిది రోజుల ముందుగానే నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినట్టు ఐఎండీ వెల్లడించింది. మరో రెండు మూడు రోజుల్లో ఏపీలోకి ప్రవేశించే అవకాశం ఉంది. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదిలాఉంటే.. అంచనాల కంటే ముందుగానే రుతుపవనాలు రావడం 16 ఏళ్లలో ఇదే మొదటిసారి. చివరిసారిగా 2009లో మే 23నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. గతేడాది రుతుపవనాలు మే 30న వచ్చాయి. కానీ, ఈ ఏడాది ఆరు రోజులు ముందుగానే వచ్చేశాయి. కాగా, 2023లో వారం రోజులు ఆలస్యంగా జూన్ 8న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయి. అలాగే 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి. ఇక, ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

### అరేబియా మహాసముద్రంలో అల్పపీడనం

అరేబియా మహాసముద్రంలో దక్షిణ కొంకణ్ తీరానికి సమీపంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. ఇది గంటకు ఆరు కిలోమీటర్ల వేగంతో తూర్పువైపు కదులుతోంది. మరికొన్ని గంటల్లో ఇది రత్నగిరి, దపోలి మధ్య దక్షిణ కొంకణ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో పశ్చిమ తీరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 27న పశ్చిమ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుండటంతో తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, ములుగు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. ఆయా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

### ఉగ్రవాద దాడుల్లో 20వేల మంది

# భారతీయుల మృతి..

### ఐక్యరాజ్యసమితిలో మరోమారు పాక్‌ను ఎండగట్టిన భారత్

ఢిల్లీ: గత నెల 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన పాశవిక ఉగ్రవాద దాడి తర్వాత తాత్కాలికంగా రద్దు చేయబడిన సింధు జలాల ఒప్పందంపై పాకిస్థాన్ "తప్పుడు సమాచారం" అందించిందని భారత్ తీవ్రంగా విమర్శించింది. పాకిస్థాన్ ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదం కారణంగా 65 ఏళ్ల నాటి ఒప్పందాన్ని నిలిపివేసినట్లు ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ తెలిపారు. పాక్ ప్రతినిధి ఐక్యరాజ్యసమితిలో ఈ ఒప్పంద అంశాన్ని లేవనెత్తారు. "నీరు ప్రాణం, యుద్ధ ఆయుధం కాదు" అని అన్నారు. దీంతో రాయబారి హరీశ్ ఘాటుగా స్పందించారు. 1960లో సంతకం చేసిన ఈ ఒప్పందాన్ని ఏప్రిల్ 22న పహల్గామ్ దాడిలో 26 మంది మరణించిన ఒక రోజు తర్వాత భారత్ నిలిపివేసింది. ఈ భయంకరమైన ఉగ్రదాడికి సరిహద్దు సంబంధాలు ఉన్నట్లు కనుగొన్న తర్వాత భారత ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. "ఆరున్నర దశాబ్దాలుగా భారతదేశంపై పాకిస్థాన్ మూడు యుద్ధాలు, వేలాది ఉగ్రవాద దాడులను చేయడం ద్వారా సింధు జలాల ఒప్పందం స్ఫూర్తిని ఉల్లంఘించింది. గత నాలుగు దశాబ్దాలలో ఉగ్రవాద దాడుల్లో 20,000 మందికి పైగా భారతీయులు మరణించారు. భారత్‌లో పాక్ ప్రభుత్వ ప్రాయోజిత సరిహద్దు ఉగ్రవాదం పౌరుల జీవితాలను, మత సామరస్యాన్ని, ఆర్థిక శ్రేయస్సును ప్రశ్నార్థకంగా మార్చేసింది. 2012లో జమ్మూకాశ్మీర్‌లోని తుల్బుల్ నావిగేషన్ ప్రాజెక్టుపై కూడా ఉగ్రవాదులు దాడి చేశారు. పాక్ కుట్రపూరిత చర్యలు మా ప్రాజెక్టుల భద్రతకు, పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తూనే ఉన్నాయి. గత రెండు సంవత్సరాలలో అనేక సందర్భాల్లో సవరణలను చర్చించాలని భారత్ అధికారికంగా పాక్‌ను కోరింది. కానీ, దాయాది దేశం వీటిని తిరస్కరిస్తూనే ఉంది. భారతదేశం చట్టబద్ధమైన హక్కులను పూర్తిగా ఉపయోగించుకోకుండా పాకిస్థాన్ అడ్డంకి ధోరణి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా ఉన్న పాకిస్థాన్... సరిహద్దు ఉగ్రవాదానికి తన మద్దతును విశ్వసనీయంగా, పూర్తిగా ముగించే వరకు ఈ ఒప్పందం నిలిపివేయబడుతుంది" అని హరీశ్ వివరించారు. పహల్గామ్ దాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ పాశవిక దాడికి ప్రతీకారంగా భారత సైన్యం మే 7న 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. పాక్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలపై క్షిపణి దాడులతో విరుచుకుపడింది. ఆ తరువాత పాకిస్థాన్ భారీ క్షిపణి, డ్రోన్ దాడిని ప్రారంభించింది. కానీ వాటిని భారత బలగాలు తిప్పికొట్టాయి. పాక్ దాడులకు ప్రతీకారంగా భారత దళాలు పాకిస్థాన్‌లోని వైమానిక స్థావరాలపై దాడి చేశాయి. ఈ క్రమంలో మే 10న ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఉద్రిక్తతలకు తెరపడింది.

## 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు..

దిల్లీ: నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు.. వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రపై నివేదిక ఇచ్చారు. పహల్గాం ఉగ్ర దాడిని ఖండిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే అంశాలను తన ప్రజంటేషన్‌లో ప్రస్తావించారు. చంద్రబాబు ప్రజంటేషన్‌లోని వివిధ అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు. చంద్రబాబు ప్రజంటేషన్‌కు సమావేశంలో పెద్ద ఎత్తున ప్రశంసలు దక్కాయి. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తన ప్రజంటేషన్‌లో చంద్రబాబు వివరించారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ఏపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు వెల్లడించారు. వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులను తాము ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనే విషయాన్ని తన ప్రజంటేషన్‌లో వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖను తీర్చిదిద్దనున్నట్లు సీఎం వెల్లడించారు. విశాఖకు గ్లోబల్ హంగులు అద్దేలా నాలుగు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్ ఏ1 వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్టు స్పష్టం చేశారు.

# 'సిస్టర్ స్ట్రోక్'తో కేటీఆర్ చిన్న మెదడు దెబ్బతిన్నది

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ప్రతిస్పందించారు. కేటీఆర్ ఆరోపణలను తిప్పికొడుతూ, ఆయనపై ఘాటైన విమర్శలు చేశారు. సచివాలయంలో మీడియాతో సీతక్క మాట్లాడుతూ, "సిస్టర్ స్ట్రోక్ దెబ్బకు కేటీఆర్‌కు చిన్న మెదడు చితికిపోయింది" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు తీసుకున్నప్పుడు లేని భయం, ఇప్పుడు విచారణ కమిషన్ ముందుకు రావడానికి ఎందుకని కేటీఆర్‌ను ఆమె సూటిగా ప్రశ్నించారు. గోబెల్స్ తరహా ప్రచారంలో కేటీఆర్‌ను మించిన వారు లేరని, ఆయనకు "గోబెల్స్ అవార్డు" ఇవ్వాలని ఎద్దేవా చేశారు. "అబద్ధాల పునాదుల మీదే బీఆర్ఎస్ పార్టీ నడుస్తోంది. గోబెల్స్‌ను కూడా కేటీఆర్ మించిపోయారు. కవిత చెప్పిన దెయ్యం బహుశా కేటీఆరే కావొచ్చు," అని సీతక్క వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి, అర్హత కేటీఆర్‌కు లేవని ఆమె అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయినప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉంది బీఆర్ఎస్ కాదా అని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు పొందడం కోసమే కేటీఆర్ పదేపదే ఈడీ ప్రస్తావన తెస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే ఆయనపై కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. యుద్ధంలో ట్రంప్ అనుసరించే నీతిని మోదీ అమలు చేస్తున్నారని, అబద్ధాన్ని నిజం చేయడం కోసం కేటీఆర్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను కేటీఆర్ పూర్తిగా విస్మరించారని మంత్రి సీతక్క అన్నారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై అనవసరమైన, తప్పుడు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. "మీకు నిజంగా నీతి, నిజాయితీ ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు కూలేశ్వరం అయిందో ప్రజలకు సమాధానం చెప్పండి" అని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన పత్రికకు (నేషనల్ హెరాల్డ్ ఉద్దేశించి) సహాయం చేస్తే తప్పేంటని ప్రశ్నించిన ఆమె, "గులాబీ కూలీల" రూపంలో దోచుకున్న వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని నిలదీశారు.

### బీఆర్ఎస్ పై నిందలు.. బిల్డర్లతో దందాలు..ఢిల్లీ పెద్దలకు చందాలు..

మొదటి పేజి తరువాయి

ఢిల్లీకి మూటలు మోసి పదవులు కొనుక్కున్నాడని, పీసీసీ చీఫ్ పదవి కోసం రూ.50 కోట్లు చెల్లించాడని కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి గతంలో ఆరోపించారని కేటీఆర్ గుర్తుచేశారు. నేషనల్ హెరాల్డ్ వ్యవహారంలో రేవంత్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై కేటీఆర్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే కరప్షన్ ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. నీతి, నిజాయితీ ఉంటే రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై అవినీతి ఆరోపణలు వస్తే దర్యాప్తు పారదర్శకంగా జరగాలంటే పదవి నుంచి తప్పుకోవాలని ఇదే కాంగ్రెస్ లీడర్లు కర్ణాటకలో డిమాండ్ చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ డిమాండ్లకు స్పందించిన యడియూరప్ప అప్పట్లో తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సంచలన ఆరోపణలు చేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా ఉన్న సమయంలో ఆయన సూచనల మేరకే 'యంగ్ ఇండియన్' కంపెనీకి డొనేషన్లు ఇచ్చామని కాంగ్రెస్ నేతలు చెప్పారని ఈడీ వెల్లడించిందన్నారు. రేవంత్ సూచనతో, నెల రోజుల వ్యవధిలో యంగ్ ఇండియన్ కంపెనీకి రూ.80 లక్షల వరకు బదిలీ చేసినట్లు ఈడీ ఆరోపించిందన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగాలంటే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటుకు నోటు కేసును తెలంగాణ ప్రజలు ఇంకా మర్చిపోలేదని కేటీఆర్ చెప్పారు. ఈ కేసు తర్వాత రేవంత్ రెడ్డి మారిపోయాడని తాము భావించామన్నారు. అయితే, కుక్క తోక వంకర, దానిని ఎవరూ సరిచేయలేరన్నట్లు ఆయన మారలేదని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### తెలంగాణ రైజింగ్-2047కు

# కేంద్రం సహకారం అవసరం

మొదటి పేజి తరువాయి

శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడిన సీఎం.. మా ఆకాంక్షలు, దృఢ సంకల్పానికి ఈ రోడ్డు మ్యాప్ ప్రతిబింబం అన్నారు. ఇంత సాహసోపేతమైన మార్పును సాధించాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం, భాగస్వామ్యం అత్యంత అవసరం. ఈ విషయంలో సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పని చేయాలని మేం ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల సమగ్ర, స్థిరమైన అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశ పురోభివృద్ధి ప్రతి రాష్ట్రం కేంద్ర పాలిత ప్రాంతం అభివృద్ధితో ముడిపడి ఉంటుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆయా ప్రాంతాలకు మద్దతుగా నిలవడంతో పాటు ఆయా రాష్ట్రాల సామర్థ్యాలను ఉపయోగించుకోవడం అత్యవసరం అన్నారు. వెనుకబడిన రాష్ట్రాలకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందించాలని జాతీయ వృద్ధిలో సమతుల్యత చాలా కీలకం అన్నారు. ఈ రోజు మనం చేసే చర్చలు దేశ ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై దీర్ఘకాల ప్రభావం చూపుతాయని చెప్పారు. ట్రిలియన్ డాలర్ల జీఎస్ డీపీ సాధించే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. జాతీయ స్థాయి అంచనాల ప్రకారం ఈ లక్ష్యం 15 ఏళ్లలో సాధ్యమవుతుందని భావిస్తున్నాం. కానీ ఈ వచ్చే పదేళ్లలోనే ఈ లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పంతో తెలంగాణ ఉందన్నారు. ఇది కేవలం కోరిక మాత్రమే కాదని వ్యూహాత్మక ప్రణాళిక, స్పష్టమైన దిశతో ముందుకు సాగుతున్న లక్ష్యం అన్నారు. ప్రతి ఆరేళ్లకు ఒక సారి మా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని రెట్టింపు చేసే సామర్థ్యాన్ని మేం స్థిరంగా కొనసాగించామని ఇదే ఊపుతో ప్రస్తుత దశాబ్దంలోనే మా జీఎస్ డీపీని ఐదు రెట్లు విస్తరించడంపై దృష్టి సారించామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లో మహిళా సాధికారత కీలకం అని అందుకే మా ప్రభుత్వం మహిళా స్వావలంబన, పెట్టుబడులు, చలనశీలత, ఆర్థికాభివృద్ధిని దన్నుగా నిలిచే పథకాలను రూపొందించామన్నారు.

### కేంద్రం, రాష్ట్రాలు టీం ఇండియాలా కలిసి పనిచేస్తే..

# ఏ లక్ష్యం అసాధ్యం కాదు

మొదటి పేజి తరువాయి

అన్ని రాష్ట్రాలు కలిసి వచ్చి టీం ఇండియా లాగా కలిసి పనిచేస్తే, ఏ లక్ష్యం అసాధ్యం కాదు" అని నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశానికి అధ్యక్షత వహించిన మోదీ అన్నారు.'వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్@2047' అనే థీమ్‌తో ఈ పాలక మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో, 'వికసిత్ భారత్'(అభివృద్ధి చెందిన భారతదేశం)ప్రతి భారతీయ పౌరుడి లక్ష్యమని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. "ప్రతి రాష్ట్రం వికసిత్ అయినప్పుడు, భారతదేశం వికసిత్ అవుతుంది. ఇది 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్ష" అని మోదీ అన్నారు.

పర్యాటక రంగానికి ప్రధాని ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ ప్రమాణాల ప్రకారం తమ రాష్ట్రంలో కనీసం ఒక టూరిజం డెస్టినేషన్ (పర్యాటక గమ్యస్థానానం) అభివృద్ధి చేయాలని మోదీ అన్నారు. "రాష్ట్రాలు ప్రపంచ ప్రమాణాలకు సమానంగా, అన్ని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను అందించడం ద్వారా ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక పర్యాటక గమ్యస్థానాన్ని అభివృద్ధి చేయాలి. ఒక రాష్ట్రం ఒక ప్రపంచ గమ్యస్థానం కావాలి. ఇది పొరుగున ఉన్న నగరాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేయడానికి కూడా దారితీస్తుంది" అని మోదీ అన్నారు. 'దిల్ సే రిష్ట బనాయా' అని చెప్పిన ప్రధాని.. ఈశాన్య భారతం ఇప్పుడు భారతదేశ వృద్ధిలో ముందంజలో ఉందన్నారు. మహిళలను శ్రామిక శక్తిలో మరింతగా చేర్చాలని కూడా ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. "వారు శ్రామిక శక్తిలో గౌరవంగా కలిసిపోయేలా మనం చట్టాలు, విధానాలను రూపొందించాలి" అని ఆయన అన్నారు. "అమలు చేయబడిన విధానాలు సామాన్య పౌరుల జీవితాల్లో మార్పును తీసుకువచ్చే విధంగా మనం పని చేయాలి. ప్రజలు మార్పును గ్రహించినప్పుడు మాత్రమే, అది మార్పును బలోపేతం చేస్తుంది. మార్పును ఒక ఉద్యమంగా మారుస్తుంది. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఒక బృందంగా మనకు గొప్ప అవకాశం ఉంది" అని ప్రధాన మంత్రి అన్నారు. నీతి ఆయోగ్ అత్యున్నత సంస్థ అయిన పాలక మండలిలో అన్ని రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, అనేక మంది కేంద్ర మంత్రులు ఉన్నారు. ప్రధాన మంత్రి మోదీ దీనికి చైర్‌పర్సన్. ఆపరేషన్ సింధూర్ తర్వాత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధాన మంత్రికి ఇది మొదటి కీలక సమావేశం. కాగా, న్యూఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ నీతి ఆయోగ్ సమావేశానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాజరు కాలేదు.

# ఢిల్లీ పర్యటనపై చంద్రబాబు బ్రీఫింగ్...!

మొదటి పేజి తరువాయి

రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టడానికి కనీసం పదేళ్ల సమయం పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చామని, ఆ దిశగా అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం సుమారు రూ.1.20 లక్షల కోట్ల బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రానికి అత్యధికంగా పెట్టుబడులు ఆకర్షించగలిగామని ఆయన వెల్లడించారు.

ఇంధన రంగంలో కీలక ప్రతిపాదనలు


రాష్ట్రంలో ఇంధన రంగానికి సంబంధించి పలు ప్రతిపాదనలను కేంద్రం ముందు ఉంచినట్లు సీఎం తెలిపారు. 'పీఎం సూర్యఘర్' పథకం కింద రాష్ట్రంలోని 35 లక్షల కుటుంబాలకు సౌర విద్యుత్ అందించాలనేది తమ ఆకాంక్ష అని, ఈ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 10 వేల కుటుంబాలకు విద్యుత్ సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. సూర్యఘర్ పథకం అమలుకు కేంద్రం పూర్తి మద్దతు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. తమ ప్రభుత్వం 'ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ'ని తీసుకొచ్చిందని, ఈ విధానం ద్వారా 72 గిగావాట్ల హరిత ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అన్నారు. ఇందుకు అవసరమైన రూ.28,346 కోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ కారిడార్‌ను మంజూరు చేయాలని కేంద్ర ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని అభ్యర్థించగా, ఆయన సానుకూలంగా స్పందించారని చంద్రబాబు తెలిపారు. కుసుమ్ పథకం కింద 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కేంద్రం ఇప్పటికే అనుమతి ఇచ్చిందని, ఏపీ త్వరలో గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా రాష్ట్రంలో 24 గంటలూ నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

రక్షణ రంగంలో ఏపీని బలోపేతం చేసే దిశగా అడుగులు

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ ఫలప్రదంగా జరిగిందని చంద్రబాబు తెలిపారు. "ఆపరేషన్ సిందూర్"ను విజయవంతంగా పూర్తి చేసినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు అభినందనలు తెలియజేశానన్నారు. రాష్ట్రంలో రక్షణ రంగ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు పలు క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు వివరించారు. జగ్గయ్యపేట-దోలకొండ క్లస్టర్‌లో అందుబాటులో ఉన్న 6వేల ఎకరాల్లో మిసైల్ అండ్ అమ్యూనేషన్ ప్రొటెక్షన్ కేంద్రాన్ని, లేపాక్షి-మడకశిర క్లస్టర్‌లో మిలిటరీ, సివిల్ ఎయిర్ క్రాఫ్ట్, ఎలక్ట్రానిక్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. అలాగే, విశాఖ- అనకాపల్లి క్లస్టర్‌లో నేవల్ ఎక్స్‌పర్‌మెంట్ కేంద్రాలు, కర్నూలు- ఓర్వకల్లు క్లస్టర్‌లో మిలిటరీ డ్రోన్లు, రోబోటిక్స్, అడ్వాన్స్ డిఫెన్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. తిరుపతి ఐఐటీలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని కోరగా, ఈ ప్రతిపాదనలన్నింటికీ కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో సైనిక కంటోన్మెంట్ ఏర్పాటు చేయాలన్న అభ్యర్థనను పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారని చంద్రబాబు వెల్లడించారు.

### పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు, నిధుల సమీకరణ

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.80వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించవచ్చని, సముద్రంలో వృథాగా కలిసిపోతున్న నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా సద్వినియోగం చేసుకోవచ్చని వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల ఇతర రాష్ట్రాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని, అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు చంద్రబాబు వెల్లడించారు.



మొదటి పేజి తరువాయి

# కరోనా కలవరం

## అప్రమత్తమైన ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్..ప్రభుత్వాలు

ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నాయి. భారత్‌లో కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7లను గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం (ఇన్సాకాగ్) శనివారం ప్రకటించింది. ఎన్‌బీ.1.8.1 రకం కేసు ఏప్రిల్ నెలలో వెలుగు చూడగా, ఎల్ఎఫ్.7 వేరియంట్‌కు సంబంధించిన నాలుగు కేసులు మే నెలలో తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో నమోదైనట్లు సంస్థ తెలిపింది. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కొత్తగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఢిల్లీలో మూడేళ్లలో తొలిసారిగా 23 మందికి వైరస్ సోకింది. దీంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. అయితే, కేసులు నమోదవుతున్నప్పటికీ, వ్యాధి తీవ్రత తక్కువగానే ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల వెల్లడించింది. అయినప్పటికీ, పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపింది.

అంతర్జాతీయంగా పెరుగుతున్న వ్యాప్తి

ఇటీవలి కాలంలో ఆసియా దేశాలైన హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి అధికంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే ఈ వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి ఎక్కువగా ఉందని సింగపూర్ ఆరోగ్యశాఖ ఇటీవల వెల్లడించింది. బాధితుల్లో జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, వారు నాలుగు రోజుల్లోనే కోలుకుంటున్నారని వైద్య నిపుణులు తెలియజేశారు.

ప్రభుత్వాల చర్యలు, నిపుణుల సూచనలు

ఢిల్లీలో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్లు, వ్యాక్సిన్ల లభ్యతను సరిచూసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. వివిధ రకాల శ్వాసకోశ వైరస్ కేసుల వివరాలను నమోదు చేయాలని కూడా సూచించింది. వైరస్ వేరియంట్లలో వస్తున్న మార్పులు, ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గడం ప్రస్తుత వ్యాప్తికి కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.

## 29న జరుగు ప్రవీణ్ పగడాల సంస్మరణ సభను విజయవంతం చేయండి..



పొన్నూరు మే 24 .జనం రిపోర్టర్: ఈనెల 29వ తారీకు జరుగుచున్న పగడాల ప్రవీణ్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని క్రైస్తవ జేఏసీ పిలుపునిచ్చింది. ఈ సంస్మరణ సభకు భారీ సంఖ్యలో క్రైస్తవులు, మానవతావాదులు ,ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శనివారం క్రైస్తవ జేఏసీ సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బిసి కమిషన్ డైరెక్టర్ ఫాదర్ చంద్ర మోహన్ ని కలిసి ఆహ్వానించడం జరిగింది. వారి సభకు పెద్ద ఎత్తున తరలివస్తావని క్రైస్తవులు కావలసిన రక్షణ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే చర్చించి క్రైస్తవ పక్షమున అండగా ఉంటానని మాట ఇచ్చారు. వారికి క్రైస్తవ జేఏసీ , సిసిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మల్లెల రాజు,రత్న ప్రసాద్ , సిస్టర్ లీల , పాస్టర్ ఆనంద పాల్ , పాస్టర్ రవికిరణ్ పాల్గొన్నారు.

## ముంపునకు గురికాకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు స్థానిక సమస్యల పై పర్యవేక్షణ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి..!!



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్.హైదరాబాద్: మే 24. ( జనం రిపోర్టర్ ) : మన్సూరాబాద్ డివిజన్, శ్రీ గణేష్ నగర్ కాలనీ ఫేస్-1 లో కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి గారు సీ.సీ రోడ్డు అభివృద్ధి పనులను మరియు స్థానిక సమస్యల పై కాలనీలో పర్యటించి సంక్షేమ సభ్యులను అడిగి తెలుసుకొని పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా పనామా పైన ఉన్న కాలనీల వర్షపు నీరు గణేష్ నగర్ కాలనీ ఫేస్-



1లోకి నేరుగా వస్తుండేదని ముంపు సమస్య పరిష్కారంలో భాగంగా వర్షపు నీరు నిలవకుండా ప్రత్యేకంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ లైన్ నిర్మించడం జరిగిందని తెలిపారు. గణేష్ నగర్ కాలనీ ఫేస్-1 నుండి ప్రత్యేకంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ మల్లికార్జున్ నగర్ కాలనీ కమాన్ లోపలి నుండి సుబ్బయ్య హొటల్ వెనుక ఉన్న బాక్స్ డ్రైన్ నాలాకు అప్పటి జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి గారి ప్రత్యేక చొరవతో మరియు శాఖల అధికారులను సమన్వయం చేసి ఇట్టి పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేయడంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. గణేష్ నగర్ ఫేస్-1 కాలనీలో వేస్తున్న సీ.సీ రోడ్డు అభివృద్ధి పనులను పర్యవేక్షించి అట్టి రోడ్డు గుత్తేదారును 20 ఫీట్ల వెడల్పు వేయాలని కోరారు అనంతరం కాలనీలో డ్రైయినేజీ సమస్య ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సత్యనారాయణ, సతీష్ చంద్, శ్రీను ప్రకాష్, మదన్మోహన్ సుధాకర్, నాగేష్, మురళీధర్, రఘుపతి, సిద్ధిరాజా, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**సి.రాయవరం లో ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా**

**పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్న నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు**



ఏలేశ్వరం, మే 24, (జనం రిపోర్టర్)కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గ, ఏలేశ్వరం మండలం సి.రాయవరం. గ్రామంలో. ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా పుట్టినరోజు వేడుకను పురస్కరించుకుని. పలివెల వెంకటేశ్వరరావు. పలివెల శ్రీనివాస్. ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా కి కేక్ కటింగ్ చేసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే దివంగత నేత వరుపుల జోగిరాజు (రాజా).ను స్మరించుకుంటూ. నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు.కార్యకర్తలు.గ్రామ ప్రజలు.పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి-కేటీఆర్ డిమాండ్



జనం రిపోర్టర్, సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్. ( జనం రిపోర్టర్ ) : నైతికత,నిజాయితీ ఉంటే ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నెషనల్ హెరాల్డ్ ఛార్జ్ షీట్ లో రేవంత్ రెడ్డి పేరు ఉండడం తెలంగాణకే అవమానకరమన్నారు. కర్నాటకలో డికే శివకుమార్ ను అక్కడి బీజేపీ నేతలు విమర్శిస్తుంటే తెలంగాణ బీజేపీ నేతలు రేవంత్ రెడ్డిని పల్లెత్తు మాట అనకపోవడం ఆ రెండు పార్టీల మధ్య ఉన్న అపురూప సంబంధానికి నిదర్శనమన్నారు. విచ్చలవిడిగా స్కాం లు చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మోడీ ప్రభుత్వం ఎందుకు కాపాడుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రజాస్వామిక స్ఫూర్తి ఉన్న తమ పార్టీలో అధ్యక్షుడికి ఎవరైనా సలహాలు సూచనలు ఇవొచ్చన్న కేటీఆర్, ఎవరైనా కోవర్డులు ఉంటే వాళ్లే బయటపడతారని చెప్పారు.

### కేటీఆర్ కామెంట్స్

యంగ్ ఇండియా నేషనల్ హెరాల్డ్ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును చార్జిషీట్లో ఈడి చేర్చడం తెలంగాణ రాష్ట్రానికి అవమానకరం. గతంలో ఎన్నో తప్పులు చేసిన రేవంత్ రెడ్డికి ఇప్పటికీ బుద్ధి రాలేదు. 2015 ఓటుకు నోటు కేసు తర్వాత రేవంత్ రెడ్డిని బ్యాగ్ మాన్ అని పిలుస్తున్నారు. నేషనల్ హెరాల్డ్ కేసు సీటుకు రూట్ కుంభకోణం 50 కోట్లు పెట్టి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్ష పదవిని కొనుక్కున్నాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియా ముందటనే చెప్పిండు. ఆనాడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలకు, ఇప్పుడు చార్జి షీట్ తో ఈ.డి ఆధారాలు చూపించింది. ఎవరు డబ్బులు ఇచ్చారు, ఏ పొజిషన్ ని అమ్ముకున్నారు, ఎన్ని డబ్బులు ఇచ్చారు అన్న వివరాలను ఈడి తన చార్జిషీట్లో స్పష్టంగా బయటపెట్టింది. తెలంగాణ అనేది కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలో మారింది. ఢిల్లీ కాంగ్రెస్కు ఎప్పుడు డబ్బులు కావాలంటే అప్పుడు భారీ మొత్తంలో అందిస్తూ రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నాడు. ఓటుకు నోటు జరిగినప్పుడు రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే, కానీ ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి. యావద్దేశం ముందు తెలంగాణ పరువు తీసారు. 2020లో కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప హౌసింగ్ స్కామ్ లో ఉన్నట్టు వార్తలు వస్తే నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే రాజీనామా చేయాలని కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పట్లో డిమాండ్ చేశారు.నిజాయితీ, నైతికత ఉంటే రేవంత్ రెడ్డి స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి పదవి నుండి తప్పుకోవాలి. లేదంటే కాంగ్రెస్ అగ్ర నాయకత్వం స్పందించి ఆయనను ఆ పదవి నుంచి తప్పించాలి. రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి కాదు మూటల ముఖ్యమంత్రి అని తేలిపోయింది. మూటలు ఇచ్చే పిసిసి పదవి పొందారనీ వెంకట్ రెడ్డి చెప్పిండు.మూటలు పంపుతూ ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారనీ దేశమంతా తెలుసు.ఆఫీస్ బేరర్ల నుంచి మూటలు తీసుకొని ఆనాడు కాంగ్రెస్ పత్రికకు నిధులు అందించారని ఈడీ చెప్పింది.17 నెలల్లోనే 44 సార్లు ఢిల్లీకి పోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరుదైన రికార్డు సృష్టించారు. చీకట్లో అమిత్ షా గారి కాళ్లు పట్టుకోవడం, కేసుల నుంచి తప్పించాలని వేడుకోవడం.. బయటికి వచ్చి పెద్ద పెద్ద ఫోజులు కొట్టడం ఇదే రేవంత్ రెడ్డి 44 సార్లు ఢిల్లీకి పోయి చేసేది. ఒక్క ఇటుక పేర్చకుండానే, ఒక కొత్త ప్రాజెక్టులు కట్టకుండానే, ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకుండానే, ఒక్క హామీని అమలు చేయకుండానే లక్ష 80 వేల కోట్ల అప్పు చేసిండు. ఈ డబ్బులు అన్ని ఎక్కడికి పోతున్నాయో ఎప్పుడైనా తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి.గత సంవత్సర కాలంగా తెలంగాణ ప్రజల సంపదను దోచి, తెలంగాణను ఏటీఎంలా మార్చి, ఢిల్లీ బాసులకు రేవంత్ రెడ్డి డబ్బులు పంపుతున్నాడు.రాహుల్ గాంధీ అఫీషియల్ బాస్ అయితే నరేంద్ర మోడీ అమిత్ షాలు రేవంత్ రెడ్డికి అనఫిషియల్ బాసులు. ఇలా ఇద్దరు బాస్ లను ప్రసన్నం చేసుకోవడానికి 44 సార్లు ఢిల్లీ పోయిండు. బిఆర్ఎస్ పై నిందలు.. బిల్డర్లు -కాంట్రాక్టర్లతో దందాలు...ఢిల్లీ బాస్ లకు వేలకోట్ల చందాలు.. సంవత్సర కాలం నుంచి రేవంత్ రెడ్డి చేస్తున్నది ఇదేదేశంలోని అన్ని విషయాలపై మాట్లాడే రాహుల్ గాంధీ తన పార్టీ ముఖ్యమంత్రి చేస్తున్న ఈ అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఈడి ఛార్జ్ షీట్లో చేర్చినప్పుడు దేశంలోని ప్రతి కాంగ్రెస్ నాయకుడు స్పందించాడు. కానీ ఒక రేవంత్ రెడ్డి మాత్రం జపాన్ పర్యటన పేరుతో తప్పించుకొని ఇప్పటిదాకా ఆ విషయంపై మాట్లాడడం లేదు.తన పేరును కూడా చార్జిషీట్లో ఈడి చేరుస్తుందన్న సమాచారం ఉండడంతోనే రేవంత్ రెడ్డి మాట్లాడడం లేదు. ఢిల్లీకి పోయి బిజెపి నాయకుల కాళ్లు పట్టుకుంటున్నాడు. మోదీ అమిత్ షాలతో ఒప్పందం కుదుర్చుకొని ముందుకు పోవడానికే రేవంత్ మౌనంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి సిగ్గు ఉంటే నైతిక విలువలు ఉంటే వెంటనే రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలి. హౌసింగ్ స్కామ్ లో ఆరోపణలు వచ్చిన తర్వాత నాటి కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప రాజీనామా చేశారు. అవినీతి ఆరోపణలు వస్తే గతంలో ఎందరో కేంద్ర మంత్రులు రాజీనామా చేశారు అలానే రేవంత్ రెడ్డి కూడా పదవి నుండి తప్పుకోవాలి.రాజ్యాంగాన్ని కాపాడాలి అని దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేస్తున్న అవినీతి బాగోతాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు. కాంగ్రెస్ డిఎన్ఏ లోనే కరప్షన్ ఉంది. నేషనల్ హెరాల్డ్ కేసులు ఆరోపణలు ఎదుర్కొంటున్న డికే శివకుమార్ పై కర్ణాటక బిజెపి నేతలు విరుచుకుపడుతున్నారు. కానీ విచిత్రంగా అదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్ రెడ్డిని మాత్రం తెలంగాణ బిజెపి నేతలు ఒక్క మాట అనడం లేదు. తెలంగాణ బిజెపి నేతలు అంతా మౌన మునుల్లాగా మారిపోయారు. ఇది కాంగ్రెస్, బిజెపిల మధ్య ఉన్న అపురూపమైన సంబంధానికి నిదర్శనం. తెలంగాణ బిజెపి ఎంపీలు చేస్తున్న భూదందా అక్రమాలకు రేవంత్ రెడ్డి వత్తాసు పలుకుతున్నందుకే మౌనమా ?కేంద్ర మంత్రులతో కలిసి తెలంగాణ బిజెపి నేతలు చేస్తున్న అవినీతి కార్యకలాపాలకు రేవంత్ సపోర్ట్ చేస్తున్నందుకే మౌనమా? పొంగులేటి ఇంట్లో ఈడి సోదాలు జరిపి దాదాపు సంవత్సరం అవుతుంది. కానీ ఇప్పటిదాకా అటు ఈడివైపు నుంచి కానీ ఇటు పొంగిలేటి వైపు నుంచి కానీ ఒక్క ప్రకటన కూడా రాలేదు.కాంగ్రెస్ మంత్రులపై చర్యలు తీసుకోవడానికి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ కు, అటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఎందుకు మొహమాటం. ?కాంగ్రెస్ మంత్రులను మోడీ ఎందుకు కాపాడుతున్నారు. ?పొంగులేటి ఇంట్లో డబ్బులు లెక్కబెట్టడానికి కౌంటింగ్ మిషన్ లను కూడా తీసుకపోతున్న విజువల్స్ మీడియాలో వచ్చాయి. ఇప్పటిదాకా ఈ విషయంలో బిజెపి స్పందించలేదు. 187 కోట్ల వాల్మీకి స్కామ్ లో కర్ణాటకలో అరెస్టులు జరిగాయి. అందులో 45 కోట్లు తెలంగాణకు బదిలీ అయ్యాయి. ఆ 45 కోట్లు అందుకున్న కాంగ్రెస్ నాయకుల పేర్లు ఇప్పటిదాకా బయటికి రాలేదు. వాళ్లను విచారించాలని ఇప్పటిదాకా ఈడీ అనుకోలేదు. 45 కోట్లు తెలంగాణ కాంగ్రెస్ నేతలకు చేరాయని రిమాండ్ డైరీలో ఈడీ రాసింది. ఆ డబ్బులను లోక్ సభ ఎన్నికల ప్రచారానికి వాడారు అని స్పష్టం చేసింది. కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కుతో వాల్మీకి స్కాం కూడా బ్రహ్మ రహస్యంగానే మిగిలిపోయింది. 2024 మే 10న తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతుందని రాహుల్- రేవంత్ రెడ్డి టాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఇప్పటిదాకా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సివిల్ సప్లై స్కామ్ లో జరిగిన కుంభకోణాన్ని మేము ఆధారంతో సహా బయటపెట్టాం. ఈ సివిల్ సప్లై స్కామ్ లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్పందించదు కేంద్ర ప్రభుత్వం స్పందించదు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఏవి కూడా విచారణ జరపడానికి ముందుకు రావడం లేదు. రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కి చెందిన శోధా కన్స్ట్రక్షన్ కంపెనీకి ఎలాంటి అర్హతలు లేకపోయినా 1137 కోట్ల రూపాయల విలువైన అమృత్ టెండర్లను అక్రమంగా కేటాయించారని మేము స్వయంగా కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే ఇప్పటిదాకా కనీసం ఒక్క మాట కూడా కేంద్ర ప్రభుత్వం మాట్లాడటం లేదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో ఫైనాన్షియల్ ఫ్రాడ్ జరిగిందని సెంట్రల్ ఎంపవర్ కమిటీ స్పష్టంగా నివేదిక ఇచ్చింది చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతిపక్ష నేతలపై మెరుపు వేగంతో స్పందించే కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలు ఇక్కడ కాంగ్రెస్ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?ఎవరు ఎవరితో కుమ్మక్కవుతున్నారో తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలిఅమృత్ కుంభకోణంలో రేవంత్ రెడ్డి బామ్మర్దిని కాపాడుతున్నది కేంద్ర ప్రభుత్వం. ఆర్ఆర్ టాక్స్ పేరుతో బిల్డర్ల దగ్గర 200 రూపాయలు వసూలు చేస్తున్నా ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. సివిల్ సప్లై స్కామ్ లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుతున్నది కేంద్రంలోని మోడీ ప్రభుత్వమే. సెంట్రల్ ఎంపవర్ కమిటీ రికమండేషన్ ఇచ్చిన తర్వాత కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉలుకు పలుకు లేకుండా ఉంది. ఇప్పుడు ఈ నేషనల్ హెరాల్డ్ కేసులోనైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందిస్తుందో లేదో వేచి చూస్తాం. ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ ను కలిసి మేము కోరుతాం.ఇన్ని రోజుల నుంచి రక్షణ కవచం లాగా రేవంత్ రెడ్డిని కాపాడుతున్న బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే నెల రోజుల తర్వాత మా కార్యాచరణను ప్రకటిస్తాం. జెపిని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రజల ముందు ఎండగడతాం.పాలమూరు రంగారెడ్డి పథకంలో ఎలాంటి అవినీతి జరగలేదు. సిబిఐ దర్యాప్తు అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు చెప్పింది. సొంత పార్టీ ఎమ్మెల్యేలు మంత్రులే 30% కమిషన్ ఇవ్వండి ఏ పని జరగదని బహిరంగంగానే చెప్తున్నారు. మంత్రులు పైసల్ తీసుకొని పనులు చేస్తారని లేకపోతే ఫైల్స్ కదలవని క్యాబినెట్ సహచరులు మీడియా ముందు బయట పెడుతున్నారు. రేవంత్ రెడ్డికి పిల్లనిచ్చిన మామ కాళేశ్వరంలో అవినీతి ఎక్కడిదని మీడియా ముందు ప్రశ్నిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టుకు 94 వేల కోట్లు ఖర్చు అయితే అందులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఎలా అంటారు ? ఇదంతా అబద్ధమని రేవంత్ రెడ్డికి పిల్లనిచ్చిన మామనే చెప్తున్నారు. ఫ్రస్టేషన్లో రేవంత్ రెడ్డి ఏదేదో చేస్తుంటారు. లీకులు ఇస్తుంటారు..నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు వచ్చిందన్న వార్తను కొన్ని పత్రికలు అసలు రాయనే లేదు. మీడియా ఎంత తాపత్రయపడ్డా, ఎన్ని అడ్వర్టైజ్మెంట్ లు తీసుకున్నా రేవంత్ రెడ్డి ఒక లొట్ట పీసు ముఖ్యమంత్రి అని ప్రజలకు అర్థమైపోయిందిమీడియా ఎన్ని దాచినా సోషల్ మీడియాతో ప్రజలకు వాస్తవాలు తెలుస్తూనే ఉంటాయి. తెలంగాణకు పట్టిన రేవంత్ రెడ్డి అనే దయ్యాన్ని ఎలా వదిలించాలన్న దాని పైనే మేము పనిచేస్తున్నాం తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ తెలంగాణకు పట్టిన దయ్యం రేవంత్ రెడ్డి. ప్రజాస్వామిక స్ఫూర్తి ఉన్న తమ పార్టీలో అధ్యక్షుడికి సూచనలు చేయడానికి ఎవరైనా ఉత్తరాలు రాయొచ్చు. అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటుంది ఇది అందరికీ వర్తిస్తుంది. ఈ పార్టీలో అందరము కార్యకర్తలమే. గతంలో కూడా అధ్యక్షులకు సూచనలు సలహాలు ఇస్తూ అనేకమంది లేఖలు రాశారు. కోవర్టులు ఎవరైనా ఉంటే వాళ్లే బయటపడతారు.

## 27 రోజులుగా కొనసాగుతున్న సి ఎచ్ ఓ ల సమ్మె, స్పందించని ప్రభుత్వం

వైద్య ఆరోగ్య శాఖ లో 6 సంవత్సరాలనుండి లుగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్నాం.



గుంటూరు ( జనం రిపోర్టర్ ) : గత రెండుసంవత్సరాలనుండి మా సమస్యలు పరిష్కారం కాకపోవడం తో మేము జిల్లాల పరిధిలో నిరవధిక సమ్మె చేస్తున్నాం. అని గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు మరియు జిల్లా ఉపాధక్షరాలు జి. వనజ కోరారు, గుంటూరు జిల్లాలో 27వ రోజు నిరసన కార్యక్రమం భాగంగాఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల గ పని చేస్తున్న మాకు నాయ్యపరమైన డిమాడ్లు పరిష్కరించాలని కోరుతూ సమ్మె కొనసాగిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం ఉద్యోగ భద్రత కలిపించాలని. ఎన్ ఎచ్ ఎమ్ ఉద్యోగులతో సమానంగా 23% వేతన సవరణ చేయాలనీ కోరారు. రెండు సంవత్సరాలుగా పేరుకుపోయి ఉన్న సమస్యల పరిష్కారం కొరకు సమ్మె బాట పట్టిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులైనటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల శనివారం గుంటూరు డి ఎమ్ ఎచ్ ఓ కార్యాలయం ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిరసన తెలియచేశారు ముఖ్యమైన డిమాండ్ అయిన రెగ్యులర్, , ముఖ్య ఇతర డిమాండ్ల అయినటువంటి వేతన సవరణ అంశం, ప్రోవిడెంట్ ఫండ్ అంశము మొదలగు వాటి మీద కూడా అసోసియేషన్ నాయకులతో త్వరితగతిన చర్చలు జరిపి పరిష్కారం కొరకు స్పష్టమైన హామీ ఇవ్వాలని జిల్లా అధ్యక్షరాలు టీ ప్రవళిక తెలిపారుఇన్ని రోజులుగా తీవ్రమైన ఎండలలో కూడా నిరవధిక సమ్మె చేస్తున్న ని పట్టించుకోకుండా, జీతాలు వేయకుండా, ఇన్సెంటివ్లు వేయకుండా మమ్మల్ని తీవ్ర మనోవేదన కు గురి చేస్తున్న ప్రభుత్వ అధికారులను జిల్లా నాయుకురాలు జ్యోష్న కోరుతున్నారు ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షరాలు జి. వనజ, మరియు జిల్లా నాయకులు సంధ్య, దీక్షిత, రవితేజ,జీవన జ్యోతి, .కె లక్ష్మి, రత్న కుమారి,క్వీన్, స్వప్న, కె. లక్ష్మి శివ నాగేంద్రమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు

## రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి



( జనం రిపోర్టర్ ) : రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి గారు పత్రికా విలేకరులతో మాట్లాడుతూ,సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే "మనం సైతం - దేశం కోసం" కార్యక్రమంలో భాగంగా తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.ఈ ర్యాలీ దిల్సుఖ్నగర్ బస్ స్టాప్ నుండి ప్రారంభమై అష్టలక్ష్మి దేవాలయ ఆర్చ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. దేశభక్తిని ప్రదర్శించే ఈ ర్యాలీలో యువత, కార్యకర్తలు, హిందూ బంధువులు, సమాజంలోని ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి గారు, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ గారు, హయత్నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు, బండారి భాస్కర్ గారు, గంగాని శ్రీను గారు, గుండెల కిరణ్ కుమార్ గారు, శ్రీధర్ గౌడ్ గారు, సురేష్ గారు తదితర నాయకులు పాల్గొన్నారు.మన త్రివర్ణ పతాకం గర్వంగా ఎగురుతూ, దేశభక్తి భావాలను ప్రజల్లో రేకెత్తించేదిగా ఈ ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా నేతలు పిలుపునిచ్చారు.జై హింద్!భారత మాతాకీ జై!

## కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకి పాల్పడుతున్న "పెద్ద పారిశ్రామికవేత్త" లుగా తమను తాము చెప్పుకునే గడ్డం కుటుంబాన్ని, తక్షణమే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి.....

-ఐఎన్టియుసి నాయకులు....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 24. శనివారం స్థానిక గోదావరిఖని లోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఐఎన్టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య, వైస్ ప్రెసిడెంట్లు వడ్డేపల్లి దాస్ లు మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో గత నాలుగు దశాబ్దాలుగా రాజకీయ చక్రం తిప్పినట్లు చెప్పుకునే గడ్డం కుటుంబం, పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తూ కార్యకర్తల మధ్య విభేదాలు సృష్టిస్తూ, కాంగ్రెస్ పార్టీకి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తుండటం తీవ్రంగా ఖండించదగిన విషయమని అన్నారు. ఒకవైపు అజాత శత్రువుగా పేరుగాంచిన, గొప్ప ప్రజానేత అయిన మా మంత్రి శ్రీధర్ బాబు పై విమర్శలు చేయడం, గడ్డం కుటుంబం రాజకీయ పతనానికి నిదర్శనమని ఐఎన్టియుసి నేతలు అభిప్రాయపడ్డారు. తమ రాజకీయ జీవితాన్ని పెద్దపల్లి జిల్లా అభివృద్ధికి అంకితమిచ్చిన శ్రీధర్ బాబు , కులాలు, వర్గాలతో సంబంధం లేకుండా అనేక మంది యువతకు నాయకత్వాన్ని అందిస్తూ, గ్రామస్థాయి నుంచి పట్టణ అభివృద్ధి వరకు అనేక ఘన విజయాలను సాధించారు. ఈ విషయం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు తెలుసు అని అన్నారు .ఇటీవల ఏఐసిసి అగ్రనాయకులు రాహుల్ గాంధీ , మల్లికార్జున్ ఖర్గే తీసుకున్న ఎస్ సి వర్గీకరణ నిర్ణయాన్ని స్వాగతించాల్సిన సమయంలో, పార్టీకి చిత్తశుద్ధితో పనిచేయాల్సిన వారు పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనడం బాధాకరం, దీనివల్ల పార్టీకి అపఖ్యాతి వస్తున్నదని వారిని వెంటనే పార్టీ నుండి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.గతంలో అనేక పార్టీలు మార్చిన గడ్డం కుటుంబంపై ప్రస్తుతం తమ పార్టీ కార్యకర్తలకే నమ్మకం లేకుండా పోయింది. "ఇంకా ఎప్పుడు పార్టీ మారుతారో...?" అన్న అనుమానాలు స్పష్టంగా వ్యక్తమవుతున్నాయని అన్నారు ."పెద్ద పారిశ్రామికవేత్త"లుగా తమను తాము చెప్పుకునే గడ్డం కుటుంబం దేశవ్యాప్తంగా 12 తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నా, వారు ప్రాతినిధ్యం వహించిన పెద్దపల్లి పార్లమెంట్ లో ఒక్కటైనా పరిశ్రమ స్థాపించకపోవడం విస్మయకర మని, స్థానిక యువతకు ఒక్క ఉద్యోగాన్నైనా కల్పించారా..? అన్న ప్రశ్నకు సమాధానం చేప్పాలని డిమాండ్ చేశారు .వాస్తవంగా వారి సంస్థకు పటాంచెరు (తెలంగాణ), అరక్కోనం (తమిళనాడు), పుణే (మహారాష్ట్ర), మిడ్నాపూర్ (పశ్చిమ బెంగాల్), రాయ్ బరేలీ (ఉత్తరప్రదేశ్), సంభల్పూర్ (ఛత్తీస్గఢ్, ఒడిశా), మిర్యాలగూడ (ఆంధ్రప్రదేశ్), జాజర్ (హర్యానా), తుమకూరు (కర్ణాటక), జైపూర్ (రాజస్థాన్) లాంటి ప్రాంతాల్లో తయారీ కేంద్రాలున్నప్పటికీ పెద్దపల్లిలో మాత్రం కనీస పరిశ్రమ స్థాపించకపోవడం లో మర్మం ఏంటో ఇక్కడ యువత కి చేప్పాలని అన్నారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకొని పార్టీ నిబంధనలను ఉల్లంఘిస్తున్న గడ్డం కుటుంబాన్ని తక్షణమే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, తద్వారా పార్టీ శ్రేణుల్లో ఉన్న నిబద్ధత గల కార్యకర్తల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఐఎన్టియుసి నాయకులు విజ్ఞప్తి చేశారు.ఇలాంటి వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాలను వాడే ధోరణిని నిరుత్సాహపరిచేలా పార్టీ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ సదానందం, రిజినల్ జనరల్ సెక్రటరీ టైసన్ శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం కృష్ణ, మందమర్రి వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, నాయకులు లాగిశెట్టి ఆంజనేయులు, నయీం, వెంకటేశ్వర్లు, కంకణాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
శనివారం -17 -మే-2025

## అంగన్వాడీ సమస్యల పోరాటలపై ఎప్పుడు ముందు వరుసలో ఉండేది.పి రామరాజు



రాజవొమ్మంగి, మే 24 జనం రిపోర్టర్: కిం(ద్ర కోలని అంగన్వాడీ కార్యకర్త రాజులమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు అంగన్వాడీల సమస్యలపై చేసే అన్ని పోరాటాల్లో ఎప్పుడు మానకుండా మనతోపాటు మిగతా వారిని కూడా తీసుకువచ్చేలా ఎంతో కృషి చేసేది.అలాంటి మంచి నిబద్ధత కలిగిన అంగన్వాడీ వర్కర్ అకాల మరణం చాలా చాలా బాధాకరం. శనివారం మృతదేహాన్ని సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు అంగన్వాడీ యూనియన్ నాయకులు మంగ,సత్యవతి తదితరులు సందర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.తమ కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని తెలియజేశారు. అంగన్వాడి వర్కర్ మృతికి సంతాపం తెలిపి మట్టి ఖర్చులు నిమిత్తం 15 వేల రూపాయలు తక్షణసాయం క్రింద ఐ సి డీ ఎస్ సీడీపీఓ దేవామణి చేతుల మీదుగా రాజులమ్మ కుటుంబానికి అందజేశారు

## ఆదిత్య హెూటల్ నాలాపై ఉన్న నిర్మాణాన్ని కూడా తొలగించాలి.....

### "అయినోళ్లకు ఆకులో కానొల్లకు కంచంలో" పెట్టే పద్ధతి ని కార్పొరేషన్ అధికారులు విడనాడాలి...

### ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్...





రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 24. రామగుండం కార్పొరేషన్ పరిధిలో రోడ్లను నాళాలను ఆక్రమించి చేసిన నిర్మాణాలను తొలగించడంలో నగరపాలక సంస్థ పనితీరు అభినందనీయమని, అలాగే మార్కండేయ కాలనీ రోడ్డు వెడల్పు మాస్టర్ ప్లాన్ ప్రకారం చేయడానికి అడుగులు పడడం శుభసూచకమని, అయితే మార్కండేయ కాలనీ ఆదిత్య హెూటల్ పక్కన ప్రధాన నాలాపై స్లాబ్ చేసి సిసి రోడ్లు నిర్మించడం జరిగింది, మాస్టర్ ప్లాన్ నిర్మాణంలో భాగంగా ఆ నాలాపై ఉన్న నిర్మాణాన్ని కూడా కార్పొరేషన్ అధికారులు తొలగించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. నూతన మున్సిపల్ చట్టం-2019 ప్రకారం నాళాలపై కానీ నాలాకు ఆనుకొని ఉన్న నిర్మాణాలు చేసే వారిపై, రామగుండం నగరపాలక సంస్థ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అలాంటి నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అనేకసార్లు ఆదిత్య రెసిడెన్సి పక్కన నాలాపై స్లాబ్ నిర్మాణం జరిగిందని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమైన స్లాబ్ ను తొలగించాలని, రామగుండం నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా నాలాపై ఉన్న నిర్మాణం పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు.వర్షాకాలంలో స్లాబ్ నిర్మాణం కోసం నాలాలో నిర్మించిన పిల్లర్ల వల్ల చెత్తాచెదారమంతా జామై పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇలా నాళాలపై నిర్మాణం వల్ల అనేక ప్రాంతాల్లో నాళాల నీరు బయటికి పొంగి పొర్లడం జరుగుతుందని, దీనివల్ల కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు." అయినవాడికి ఆకులో కాని వాడికి కంచంలో" పెట్టే పద్ధతిని ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు విడనాడాలని అన్నారు. రామగుండం కార్పొరేషన్ లో ఒక బలమైన నాయకత్వం ఉన్నందున ఈ పరిస్థితుల్లోనే మాస్టర్ ప్లాన్ అమలు చేయడానికి అధికారులంతా కసరత్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణలో కోవిడ్ -19 కేసు నమోదు...

### - కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన డాక్టర్‌కు పాజిటివ్ బి కేర్ ఫుల్..





,సిటీ ఇన్చార్జ్ అనిల్ కుమార్, మే 24 :- ( జనం రిపోర్టర్ ) : యావత్ ప్రపంచాన్నీ వైరస్‌తో వణికించిన కోవిడ్ 19 మహమ్మారి మళ్లీ జడలు విప్పుతోన్న సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలో గత నాలుగు రోజులుగా అక్కడక్కడా కరోనా మాట వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అయితే,తాజాగా తెలంగాణలో కోవిడ్ 19 కేసు నమోదైంది. హైదరాబాద్ మహానగరనందు కూకట్‌పల్లిలో ఒక డాక్టర్‌కు కోవిడ్ 19 పాజిటివ్ నిర్ధారణ అయింది.దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.కాగా,చైనాలో పుట్టి ప్రపంచమంతటా విస్తరించిన కోవిడ్ 19 వైరస్ (కోవిడ్ 19) తెలంగాణలో మొదటి సారిగా 2020 మార్చి 2న తొలి కోవిడ్ 19 వైరస్ కేసు నమోదైంది. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కి వచ్చిన ఓ వ్యక్తికి కోవిడ్ 19 వైరస్ ఉందని వైద్యులు నిర్ధారించారు.ఈ క్రమంలో దేశవ్యాప్తంగా కోవిడ్ 19 వైరస్ కేసులు లక్షల్లో నమోదుకావడం, రెండు సార్లు లాక్ డౌన్లతో మొత్తం జనజీవనం స్థంభించిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఈ వైరస్ భారిన పడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికా కోవిడ్ 19తో కకావికలమైంది. ఎటు చూసినా శవాల కుప్పలు కనిపించాయి.... రాష్ట్ర ప్రజ లు కోవిడ్-19 పై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ సూచించారు.

## ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి.

### వామపక్ష భావజాలన్నీ అంతం చేయడం ఎవరి తరం కాదు....

### -చాడ వెంకటరెడ్డి....





రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 24. భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో పార్టీని మరింత బలమైన రాజకీయ శక్తిగా ముందుకు తీసుకెళ్తామని, వామపక్ష భావజాలన్నీ అంతం చేయడం ఎవరి తరం కాదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా గోదావరి ఖని భాస్కర్ రావు భవన్ కు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మావోయిస్ట్ నేతలను ఎన్కౌంటర్ పేరుతో చంపుతూ, పైచాచిక ఆనందాన్ని పొందుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని ఆరోపించారు. మావోయిస్ట్ పార్టీ ప్రభుత్వం తో శాంతి చర్చలు జరుపుతామని ఆయుధాలను పక్కన పెట్టి కాల్పుల విరమణ ప్రకటించిన తరువాత నక్సలైట్ల ఏరివేత కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టడం హేయమైన చర్య అని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.ఉగ్రవాదాన్ని అంతం చేయడం లో విఫలమైన కేంద్ర ప్రభుత్వం ప్రజల దృష్టి మరల్చడానికే ఆపరేషన్ కగార్ ను చేపట్టిందని తెలిపారు.అలాగే సిపిఐ జాతీయ మహాసభలు సెప్టెంబర్ లో చండీఘర్ లో , తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆగస్టు లో మేడ్చల్ జిల్లాలో జరుగన్నాయని ఆలోపు శాఖ,పట్టణ, మండల జిల్లా మహాసభలు పూర్తి చేయాలని ఆయన అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకరన్న, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాంద్ర సదానందం లు మాట్లాడారు. ఈ సమావేశం లో జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ గోసిక మోహన్, జిల్లా పూర్వ కార్యదర్శి కామ్రేడ్ గౌతం గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ కె.కనకరాజ్ , తాళ్ళ పెల్లి మల్లయ్య, కొడం స్వామి, తదితరులు పాల్గొన్నారు.అనంతరం పాత్రికేయ మిత్రులతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ మణికంఠ రెడ్డి, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు తాళ్ళ పెల్లి లక్ష్మణ్, మర్కా పూరి సూర్య, రేణుకుంట్ల ప్రీతం, శనిగరపు చంద్రశేఖర్, అబ్దుల్ కరీం, తాళ్ళ పెల్లి సురేందర్, మాతంగి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి గ్రామపంచాయతీ పంపు ఆపరేటర్ మరణం



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : ఈరోజు హనుమకొండ జిల్లా,హసన్ పర్తి మండలంలోని కొత్తపెల్లి గ్రామంచాయతీలో పంపు ఆపరేటర్ గా విధులు నిర్వర్తిస్తున్న క్రీ:శే:కూరాకుల రవీందర్ అకాల మరణం చెందారు, పార్థివ దేహానికి నివాళులర్పించి,వారికుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.రవిందర్ కు భార్య రేణుక,ఒక కుమారుడు జయప్రకాష్,కుమార్తె ఉష వివాహం జరిగినది,తల్లి లక్ష్మీ ఉన్నారు,ప్రభుత్వం నుండి యాబైలక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించి,ప్రస్తుత దహన సంస్కారాల కర్చుల నిమిత్తం పది వేల రూపాయలు ఇచ్చి,కుటుంబసభ్యుల లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి,రోడ్డున పడ్డ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం నుండి డిమాండ్ చేస్తున్నాము.ఈ కార్యక్రమంలో కారోబార్,బిల్ కలెక్టర్ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాతల్ల సదానందం,పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు సంతోష్,కారోబార్,బిల్ కలెక్టర్ల ఉద్యోగుల సంఘం హసన్ పర్తి మండల నాయకులు కేతపాక కొమురయ్య,శోబాన్,కూనమల్ల రమేష్, పిట్ట రాజు,తోగర ఐలయ్య, ఇల్లందుల సదానందం,పాల్గొన్నారు

## పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలి.....

### పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్, రాఘవ పూర్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన -అదనపు కలెక్టర్ డి.వేణు...



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 24. పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలి అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు.శుక్రవారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు, రాఘవ పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ డి.వేణు తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇప్పటివరకు 13 వేల 500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 3 వేల 500 క్వింటాళ్లు సైతం నాణ్యత ప్రమాణాలు రాగానే



కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సెంటర్ ఇంచార్జి కు సూచించారు. తడిసిన ధాన్యం ఆరబెట్టిన తర్వాత తేమ శాతం రాగానే తూకం వేసి కొనుగోలు చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన గన్ని బ్యాగులు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.రాఘవ పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అదనపు హమాలీలను ఏర్పాటు చేసి పెండింగ్ ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ 3 నుంచి 4 రోజులలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు 48 గంటల్లో చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి మున్సిపాలిటీకి ఉత్తమ పర్యావరణ అవార్డు: మున్సిపల్ కమిషనర్ యోగేష్







రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ శంకర్‌పల్లి ( జనం రిపోర్టర్ ) : శంకర్‌పల్లి మున్సిపాలిటీకి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉత్తమ పర్యావరణ పని తీరు అవార్డు రావడం జరిగిందని మునిసిపల్ కమిషనర్ యోగేశ్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ యోగేష్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు మున్సిపాలిటీలతో పాటు శంకర్‌పల్లి మున్సిపాలిటీకి ఈ అవార్డు దక్కిందని తెలియజేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆడిటోరియం సనత్ నగర్ లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందించనున్నారని పేర్కొన్నారు.

## గ్రామ పాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలి......

### గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై సమావేశం నిర్వహించిన -అదనపు కలెక్టర్ డి.వేణు....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 24. గ్రామ పాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు గురువారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, జూన్ 25న ఆదివారం నాడు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలకు పెద్దపల్లి జిల్లాలో 90 మంది అభ్యర్థులు హాజరవుతారని, పెద్ద కాల్వల లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో ప్రశ్నా పత్రాలు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ అనుమతి లేదని అన్నారు . పరీక్షల ముగిసిన తర్వాత అభ్యర్థుల జవాబు పత్రాలను సీజ్ చేసి కన్వీనర్ జేఎన్టీయూ కు పంపాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 10 గంటలకు మూసివేయడం జరుగుతుందని గేటు మూసివేసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి అరగంటకు అభ్యర్థులకు సమయం తెలిసేందుకు గంట మోగాలని , పరీక్ష కేంద్రాల పరిసరాల్లో న జిరాక్స్ షాపులను మూసివేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నాలరు.

## రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు.....





రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 24. ఉచిత న్యాయ సేవలు అందుకోవడానికి పేద ప్రజలు మండల న్యాయ సేవ సమితిని సంప్రదించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ , డిస్ట్రిక్ట్, అడిషనల్ సెషన్స్ జడ్జి టి. శ్రీనివాస రావు సూచించారు. మండల న్యాయ సేవ సమితి ఆద్వర్యంలో శనివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన, న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వరకట్న దురాచారం రూపుమాపడానికి , భ్రూణ హత్యలు అరికట్టడానికి , అవినీతి నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పు దారిలో పోకుండా ఉండేందుకు వారిలో జ్ఞానం పెంపొందడానికి విద్యా బుద్దులు నేర్పించాలని అన్నారు. క్షణికావేశంలోనే



ఎక్కువ శాతం నేరాలు జరుగుతున్నాయని అన్నారు. నేరాలు జరగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు తమ భావోద్వేగాలను , ఆవేశాలను నియంత్రించుకోవాలని అన్నారు. ఆలోచన అనేది మనిషికి దేవుడిచ్చిన వరమని అన్నారు. మంచి ఆలోచనలతో క్రమశిక్షణ, నీతి , నిజాయితీతో సకాలంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. సంపాదించిన ఆస్తులు శాశ్వతం కావని సంపాదించుకున్న పేరు మాత్రమే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అలెగ్జాండర్ , ఆల్ఫ్రెడ్ నోబెల్ ఉదంతాలు నిరూపించాయని అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అనుకొని సాధ్యమైనంత వరకు అవసరం ఉన్న వారికి , ఆపదలో ఉన్న వారికి సహాయం అందించాలని అన్నారు. అలాగే సమాజ హితం కోసం అవసరమైన పక్షంలో ఎక్కువ సమయం కేటాయించి సిబ్బంది పని చేయాలని అన్నారు. ఎక్కువ సంఖ్యలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేందుకు తాను లీవులు ఎక్కువగా వాడుకోవడం లేదని అన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో మున్సిపల్ కార్మికులు అందించిన సేవలను ప్రశంసించారు. న్యాయవాది జీవన్ గ్లోరీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ వాడుతున్న పిల్లలు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలని అన్నారు. ఈ సదస్సులో రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , న్యాయవాదులు గుడికందుల భూమయ్య ,గోలి తిరుపతి రావు , ఆర్ ఓ ఆంజనేయులు , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , మెప్మా సి ఓ లు , ఆర్ పి లు , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను పెనాల్టీ చెల్లించడానికి జూన్ 30, 2025 వరకు మాత్రమే గడువు ఉన్నందున పన్ను చెల్లింపుదారులు త్వరపడాలి....

### స్థానిక సంస్థలు కమిషనర్ (ఎఫ్ ఎ సి )అరుణ శ్రీ....





రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 24. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ( 2025-26 ) సంబంధించిన ఆస్తి పన్ను పెనాల్టీ లేకుండా చెల్లించడానికి జూన్ 30, 2025 వరకు మాత్రమే గడువు ఉన్నందున పన్నుచెల్లింపుదారులు త్వరపడాలని, అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) అరుణ శ్రీ ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఇంటింటికీ ఆస్తి పన్నుల డిమాండ్ నోటీసుల పంపిణీ ప్రక్రియ మరో మూడు రోజుల్లో ముగియనుందని అన్నారు. డిమాండ్ నోటీస్ రాకున్నప్పటికీ ఆన్ లైన్ లో లేదా నగర పాలక సంస్థ కార్యాలయ కౌంటర్ లో, లేదా ప్రభుత్వ మీ సేవా కేంద్రాల్లో లేదా , ఇంటి ముందుకు వచ్చే వార్డు అధికారుల వద్ద పన్ను చెల్లించవచ్చని తెలిపారు. జూన్ 30, 2025 తరువాత ప్రతినెలా ఆస్తి పన్ను మొత్తం పై రెండు శాతం పెనాల్టీ విధించడం జరుగుతుందని తెలిపారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ , ప్రభుత్వేతర ఆస్తులు 51,014 ఉండగా 15, 176 ఆస్తులకు సంబంధించి పన్ను ఇప్పటివరకు చెల్లించారని తెలిపారు. ుగిలిన 35, 838 పన్ను చెల్లింపుదారులు కూడా వెంటనే ఆస్తి పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

## రాజ్యాంగాన్ని లౌకిక వాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం నేదునూరి జ్యోతి





హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : మే 24 హసన్ పర్తి: దేశ ప్రజలకి భారత రాజ్యాంగం అందించిన హక్కులు, స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతత్వం, అందరికీ అందని ద్రాక్షగా పాలకులు చేస్తున్నారని నేదునూరి జ్యోతి తెలిపారు. పేదలు దళితులు బహుజనులు నేటికీ రాజ్యాంగ హక్కులు అందడం లేదని ఆవేదన వెలుబు ఇచ్చారు. స్వేచ్ఛగా భావాలను వెలిబుచ్చితే అర్బన్ నక్సలైట్ అంటున్నారు దేశద్రోహి అంటున్నారని ప్రభుత్వం దేశ ప్రజలలో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోయి తీవ్ర అలజడులు పోరాటాలు నెలకొంటున్నాయి. పేద ధనిక తేడాను నిర్మూలించి సోషలిజం వైపు తీసుకెళ్లి ఆర్థిక సాంఘిక రాజకీయ సమానత్వం సాధిస్తాం అనే భారత రాజ్యాంగ లక్ష్యం పాలకులు నెరవేర్చలేదన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే అన్నట్లు నేటి పాలకులు దిగజార్చారు అని ధ్వజమెత్తారు ఎన్నికలలో డబ్బు, మద్యం, కులం, మతం, ప్రభావితం చేస్తున్నాయని పేదలు ఎన్నికలలో నిలిచి గెలిచే పరిస్థితి లేదని అన్నారు. ప్రాథమిక హక్కులకు ఆదేశిక సూత్రాలకు జీవించే హక్కుకు భంగం కలిగిస్తూ రాజ్య హింస కొనసాగిస్తున్న పాలకుల్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. పేదరిక నిర్మూలనకు భూమిలేని నిరుపేద దళిత బహుజన లందరికీ ప్రతి కుటుంబానికి భూమి పంచాలని కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుంది అన్నారు. బుటకపు వాగ్దానాలతోటి ఎన్నికల్లో గెలుస్తున్నారు గెలిచిన తర్వాత ఇచ్చిన వాగ్దానాల్ని తుంగలో తొక్కుతున్నారని, వికసిత భారత్ హామీలు గాని ప్రజా పాలన హామీలు వెంటనే నెరవేర్చి చిత్తశుద్ధి ప్రదర్శించాలన్నారు. శనివారం రోజున హసన్పర్తి మండలం మడిపల్లి గ్రామంలో జక్కుల సాంబరాజు అధ్యక్షతన సిపిఐ సమావేశం జరిగినది ముఖ్యఅతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ పేదల కష్టాలు పోవాలంటే రైతు కూలీ రాజ్యం రావాలంటే కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలపరచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 26 ,27 తేదీలలో హసన్పర్తి లో జరుగు హన్మకొండ జిల్లా రెండవ మహాసభలను బహిరంగ సభను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అనంతరం హసన్ పర్తి మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంవత్సరానికి 15 వేల రూపాయలు విద్యార్థులకు స్కూటీలు, మహిళ పెండ్లికి తులం బంగారం, సన్న వడ్లకు 500 బోనస్, వృద్ధాప్య వితంతు వికలాంగులకు ఇచ్చే పెన్షన్లు పెంచుతామన్నమాట గ్యారెంటీ ల పేరుతో ఇచ్చిన నీటి మూటలుగా తేలిపోతున్నాయన్నారు. వెంటనే ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయాలని ఇందిరమ్మ ఇండ్లు మహిళను లక్షాధికారులను కోటీశ్వరులను చేస్తామన్న హామీలు అమలు చేయాలని లేని ఎడల గత పాలకులకు పట్టిన గతే పడుతుందన్నారు. సమావేశం అనంతరం జిల్లా మహాసభల గోడ పత్రికలను విడుదల చేయడం జరిగినది ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు నేదునూరి రాజమౌళి జక్కుల సాంబరాజు, మడిపల్లి సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి చిలుకూరి రాము, బుర్ర సుధాకర్, ముద్రవేయున రాజు, జక్కుల అశోక్, బుర్ర వెంకటేష్, బుర్ర స్వప్న, బుర్ర అనిత, జి శివ, ముంజ రమేష్, సాంద్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో కాంగ్రెస్ ఖతం..
## ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీదే అధికారం..



**న్యూఢిల్లీ,:** రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ పాలన పట్ల కర్ణాటక ప్రజల్లో అసంతృప్తి పెరిగినట్లు తాజాగా సర్వేలో తేలింది. పీపుల్స్ పల్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఇప్పటికిప్పుడు కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరిగితే బీజేపీ ఘన విజయం సాధిస్తుందని సర్వే చెప్పింది. అయితే, ఇప్పటికీ సిద్ధరామయ్య రాష్ట్రంలో అత్యధిక మంది ఇష్టపడే ముఖ్యమంత్రి ఫేస్‌గా ఉన్నారని సర్వే చెప్పింది. మొత్తం, 10,481 మంది సర్వేలో ప్రతిస్పందించారు. సర్వే ప్రకారం, బీజేపీ పూర్తి మెజారిటీతో 136-159 సీట్లు సాధిస్తుందని అంచనా వేసింది. బీజేపీకి 51 శాతం ఓట్లు వస్తాయని తెలిపింది. కాంగ్రెస్‌కి 40.3 శాతం (2023లో 42.88శాతం) ఓట్లతో 53-82 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసింది. జేడీఎస్ 5 శాతం ఓట్లతో 3-6 సీట్లకు మాత్రమే పరిమితమవుతుందని సర్వే చెప్పింది. కర్ణాటకలో మొత్తం 224 సీట్లు ఉన్నాయి, అధికారానికి మ్యాజిక్ ఫిగర్ 113 సీట్లు. బీజేపీ కర్ణాటక రాష్ట్ర రాజకీయాల్లో గత 20 ఏళ్ల నుంచి ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ మూడు సార్లు -2004, 2008, 2018లో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, మ్యాజిక్ ఫిగర్ 113ని సాధించి ఎప్పుడూ అధికారాన్ని చేపట్టలేదు. ముఖ్యమంత్రిగా మాత్రం కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య 29.2 శాతం ఓటర్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నారు. మరో కాంగ్రెస్ నేత 10.7 శాతం ఓట్లతో డీకే శివకుమార్ రెండో ప్లేస్‌లో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రులు బి.ఎస్. యడియూరప్ప (5.5 శాతం), బసవరాజ్ బొమ్మై (3.6 శాతం) మరియు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర (5.2 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇదిలా ఉంటే, కర్ణాటక ప్రజలు ప్రధానిగా మరోసారి నరేంద్రమోడీ వైపే నిలిచారు. నరేంద్రమోడీకి 59 శాతం మంది సపోర్ట్ చేయగా, రాహుల్ గాంధీకి 17 శాతం, యోగి ఆదిత్యనాథ్‌కి 11 శాతం మంది ప్రతివాదులు మద్దతుగా నిలిచారు.

## వల్లభనేని వంశీ కస్టడీ పూర్తి..
## 20 కేజీలు తగ్గారని భార్య వెల్లడి..!





**అమరావతి,:** వల్లభనేని వంశీ రెండు రోజుల కస్టడీ పూర్తి అయింది.. బాపులపాడు నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో నమోదైన కేసుకి సంబంధించి వంశీని రెండ్రోజుల పాటు పోలీసులు విచారించారు. వంశీని 30కిపైగా ప్రశ్నలు అడిగారు. నకిలీ ఇళ్ల పట్టాలను ఎక్కడ ఎవరు ఎందుకు తయారు చేసారని వంశీని పోలీసులు ప్రశ్నించారు. నకిలీ ఇళ్ల పట్టాల తయారీలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే విషయాల్ని అడిగారు. తనకు నకిలీ పట్టాలతో సంబంధం లేదని వంశీ సమాధానం చెప్పారు. వంశీ అస్వస్థతకు గురైన నేపథ్యంలో సరిగ్గా విచారణ చేయలేదని పోలీసులు చెబుతున్నారు. కస్టడీ అనంతరం వంశీని నూజివీడు కోర్టు నుంచి విజయవాడ సబ్ జైలుకి తరలించారు. ఈ సందర్భంగా వంశీ భార్య పంకజ శ్రీ మాట్లాడారు. "వంశీ తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సీ క్యాప్ తో మాత్రమే శ్వాస తీసుకునే పరిస్థితి లో ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం పూర్తి స్థాయిలో అందటం లేదు. ఎయిమ్స్ వంటి మెరుగైన ఆసుపత్రిలో వైద్యం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరాం. 105 కిలోల నుంచి 85 కిలోలకి బరువు తగ్గిపోయారు." అని పేర్కొన్నారు.

## అధికారంలోకి రాగానే మాట మార్చేశారు..
### పవన్ కల్యాణ్‌పై పేర్నినాని ఫైర్..





**అమరావతి,:** జగన్ ప్రభుత్వంలో తక్కువ రేటుకే సినిమాలు చూడాలి అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారని పేర్ని నాని గుర్తు చేశారు.. అప్పుడు ఇదే పవన్ కళ్యాణ్.. నోటికి వచ్చినట్లు మాట్లాడారన్నారు.. సినిమా మాది మా ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటామని గతంలో పవన్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. అప్పుడు ఏం మాట్లాడారు.. ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.. పవన్ అధికారంలో ఉంటే ఓ మాట.. ప్రతిపక్షంలో ఉంటే మరో మాట మాట్లాడటం సరికాదన్నారు. సినిమా వాళ్లకు గొడవలు జరుగుతున్న సమయంలో జైల్లో వేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. సినిమా ఫీల్డ్ ను ఉద్ధరిస్తారని ఆ శాఖ తీసుకున్న మంత్రి థియేటర్ యాజమాన్యాలపై విచారణకు ఆదేశించారని చెప్పారు.. ఇవి దివాలకోరు రాజకీయాలు కావా? అని నిలదీశారు. మీ చెప్పు చేతల్లో ఉన్న మంత్రితో బెదిరింపులు చేస్తారా? అని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ఫైర్ అయ్యారు. జైళ్లలో వస్తామని బెదిరిస్తున్నారని.. రాబోయే ఫ్లాప్ సినిమా కోసం ఇంతలా చేయాలా? అని మండిపడ్డారు. గతంలో పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలు అందరికీ గుర్తున్నాయని.. సినిమా వాళ్ళను బెదిరించటానికి మీరు ఎవరు? అని ప్రశ్నించారు. అసలు వాళ్ళ సమస్య ఏంటో మీకు తెలుసా? అని అడిగారు. వైసీపీకి అంత్రక్రియలు చేస్తామని వ్యాఖ్యానించిన సోమిరెడ్డిపై పేర్ని నాని ఫైర్ అయ్యారు.అంత్యక్రియలు చేయటం సోమిరెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని.. రాజకీయంగా చేరదీసిన ఎన్టీఆర్ కే వెన్నుపోటు పొడిచిన ఘనులు వీళ్ళని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవులు ఇవ్వలేదని ఎవరికి పడితే వాళ్లకు అంత్యక్రియలు చేయకండని సూచించారు. వాసంశెట్టి సుభాషే ఒక పిల్ల గాడిద అని తీవ్రంగా విమర్శించారు..

## దిక్కుతోచని స్థితిలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌కి పరిమితమయ్యారు




**హైదరాబాద్, :** ఎమ్మెల్సీ కవిత మాజీ సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖ వ్యవహారం తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలోనే టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇంట్లో కుంపటి తట్టుకోలేక కేటీఆర్ సతమతం అవుతున్నాడని, ఎకు మేకై మరో పవర్ సెంటర్ రావడంతో మతిభ్రమించి, రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ మాట్లాడారని ఆయన మండిపడ్డారు. కవిత ఎపిసోడ్ ను డైవర్ట్ చేయడానికి కేటీఆర్, సీఎం రేవంత్ పై ఆరోపణలు చేశాడని, కేటీఆర్ ముందు ఇంట్లో రగులు నాకు ఇప్పటిని సరిపెట్టుకోవాలన్నారు మహేష్ గౌడ్. పది సంవత్సరాల టిఆర్ఎస్ తప్పిదాలను కవిత తప్పులను ఎత్తి చూపిందని, టీఆర్ఎస్ తప్పిదాలన్ని ప్రజలకు అర్ధమవుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా..కాలేశ్వరం అవినీతిలో కేసీఆర్‌కు నోటీసులతో, కేటీఆర్ భయపడుతున్నాడని, బీఆర్ఎస్ కు, బీజేపీకి స్పష్టమైన అవగాహన ఉన్నట్లు కవిత వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయని, బిఆర్ఎస్ మూడు ముక్కలు కాబోతుందన్నారు మహేష గౌడ్. కవిత, కేటీఆర్ మధ్య పోటీ తీవ్రం కావడంతో అదును కోసం హరీష్ రావు ఎదురు చూస్తున్నారని, దిక్కుతోచని స్థితిలో కెసిఆర్ ఫామ్ హౌస్ కి పరిమితమయ్యారన్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలు ఎవరో ప్రజలకు తెలియాలని, పదేళ్ల అవినీతిలో పంపకాల్లో వచ్చిన తేడాతోనే, కవిత జెండా ఎగరవేసినట్లు అర్థమవుతుందన్నారు. భవిష్యత్తు తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో బీఆర్ఎస్ ఉండదని ఆయన వ్యాఖ్యానించారు.

# నియంతలను తలదన్నిన నెతన్యాహు



నియంతల ఏలుబడిలో పౌరహక్కులకు తావు ఉండదు. మంచీ, మానవత్వానికి చోటు దొరకదు. నిరంకుశత్వానికే అక్కడ అగ్రతాంబూలం. కానీ, నేటి ఆధునిక యుగంలో ప్రజాస్వామ్యం ముసుగులో నియంతలను తలదన్నే దేశాలున్నాయంటే నమ్మశక్యం కాదు. అలాంటి దేశాల జాబితాలో అగ్రస్థానం ఇజ్రాయెల్ దేనంటే ఆశ్చర్యపోనక్కరలేదు. పేరుకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్న ఈ దేశంలో అధికార పీఠంపై కూర్చున్నది అక్షరాలా ఓ నియంత. ఆ పెద్దమనిషి పేరు బెంజమిన్ నెతన్యాహు. ఆయన నేతృత్వంలో గాజాపై గత 18 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండలో 52 వేల మందికి పైగా అసువులు బాశారు. లక్షలాదిమంది క్షతగాత్రులయ్యారు. అయినా ఆయన యుద్ధకాంక్ష మాత్రం తీరలేదు సరికదా, రానురాను మరింత పెచ్చరిల్లుతోంది. గాజాపై 'పరిపూర్ణ విజయం' సాధించేవరకూ విశ్రమించబోనని ఇటీవల ఆయన చేసిన శపథమే ఇందుకు ఉదాహరణ. 'గాజాను మొత్తం స్వాధీనం చేసుకుంటాం. అక్కడ నెలకొన్న కరవు పరిస్థితులను నివారించవలసి ఉంది' అంటూ ఆయన తాజాగా చేసిన ప్రకటన గిచ్చి జోలపాడటమనే సామెతను గుర్తు చేయక మానదు. గాజాను ఇంతటి దుర్భర స్థితిలోకి నెట్టిన నెతన్యాహు ఇప్పుడు దానిని బాగు చేస్తామనడాన్ని చూసి ముక్కున వేలేసుకోనివారు ఉండరు. గాజాలో ప్రస్తుత పరిస్థితిని వర్ణించడానికి మాటలు చాలవు. ఎక్కడ చూసినా శిథిల భవనాలు, బక్కచిక్కిన మనుషులు. ఆకలి బాధను తట్టుకోలేక కళ్లముందే బిడ్డలు చనిపోతుంటే ఏడవడానికి కూడా ఓపికలేని మాతృమూర్తులను చూస్తే ఎవరికైనా గుండె చెరువుకాక మానదు. గాజాకు తక్షణ మానవతాసాయం అందకపోతే, రానున్న 48 గంటల్లో 14వేల మంది చిన్నారులు క్షుద్బాధతో చనిపోయే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసిందంటే, అక్కడి పరిస్థితి ఎంత భీతావహంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కానీ నెతన్యాహు మనసు మాత్రం కరగడం లేదు. గత కొన్ని నెలలుగా మానవతాసాయంపై ఉక్కుపాదం మోపిన ఆ పెద్దమనిషి, ఐక్యరాజ్య సమితి హెచ్చరికతోనూ దిగిరాకపోగా, పరిమితి సాయానికి మాత్రమే అనుమతినిస్తామనడం కరడుగట్టిన రాక్షసత్వానికి నిదర్శనం. హమాస్ ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు ఆ లక్ష్యానికి ఎగనామం పెట్టి, ఆస్పత్రులు, శరణార్థి శిబిరాలపైనా యథేచ్ఛగా బాంబుల వర్షం కురిపిస్తూ అమాయకుల ప్రాణాలు హరిస్తున్నారు. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ సైన్యం హతమార్చిన యాభైరెండు వేలమందిలో హమాస్ ఉగ్రవాదులు ఎంతమందో ఆయన చెప్పగలరా? జనవరి నెలలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని తుంగలో తొక్కి మళ్లీ యుద్ధానికి సిద్ధపడిన నెతన్యాహు ప్రధాన లక్ష్యం గాజా ఆక్రమణే. గాజాను స్వాధీనం చేసుకుని, కరవు పరిస్థితులను నివారిస్తామని నెతన్యాహు చెబుతుండగా, అక్కడి ప్రజలను వేరే చోటికి తరలించి, గాజాను అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు. మొత్తానికి ఇద్దరికీ ఒకటే లక్ష్యం.. గాజాను హస్తగతం చేసుకోవడం. అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టీ పట్టగానే ఆధునిక శాంతిదూత అవతారమెత్తిన ట్రంప్, రష్యా- ఉక్రెయిన్‌బీ హమాస్- ఇజ్రాయెల్ యుద్ధాలపై గుడ్లురిమారు. తక్షణమే యుద్ధవిరమణ జరగకపోతే జాగ్రత్త అంటూ హెచ్చరించారు. కానీ, వాస్తవంలో తాను ఆశించింది జరగకపోగా, ఇజ్రాయెల్‌ను కనీసం చర్చల వేదికపైకి కూడా రప్పించలేకపోతున్నారు. అంతెందుకు, గాజాపై ఇజ్రాయెల్ అమానుష కాండను తాజాగా బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా ముక్తకంఠంతో ఖండించగా అమెరికా వాటితో గొంతు కలపకపోవడం దేనికి సంకేతం? ఇజ్రాయెల్‌తో స్వేచ్ఛా వాణిజ్య చర్చలను సైతం నిలిపివేసి, బ్రిటన్ తన నిబద్ధతను చాటుకోవడం ప్రశంసనీయం. హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలే లక్ష్యంగా 2023 అక్టోబర్ 1న యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు ఇప్పుడు తన లక్ష్యాన్ని తానే తుంగలో తొక్కి గాజా ఆక్రమణ దిశగా అడుగులు వేయడానికి స్వప్రయోజనాలతోపాటు రాజకీయ ప్రయోజనాలు కూడా కారణం. యుద్ధాన్ని ఎంతకాలం కొనసాగిస్తే అంతకాలం తాను పదవిలో కొనసాగవచ్చునన్నది ఆయన ఆలోచనగా కనబడుతోంది. ఇప్పటికే నెతన్యాహుపై అనేక అవినీతి ఆరోపణలపై వివిధ కోర్టులలో విచారణ జరుగుతోంది. మరోవైపు నిరంతర యుద్ధం పట్ల ఇజ్రాయెల్ లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇప్పటికైనా మేలుకోవాలి. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాల బాటలో ఇజ్రాయెల్‌పై వత్తిడి తెచ్చేందుకు చేయీచేయీ కలిపి ముందుకు రావాలి. గాజాకు మానవతా సాయం అందించడమే తక్షణ కర్తవ్యంగా నెతన్యాహు మెడలు వంచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలి.

# గ్లోబల్‌ట్యాక్స్‌తో గ్రీన్‌గ్యాస్ ఉద్గారాలు తగ్గేనా?



గ్లోబల్ వార్మింగ్ కట్టడికోసం గ్రీన్‌హౌస్ ఉద్గారాల (హరిత వాయువుల వెల్లువ)పై గ్లోబల్ ట్యాక్స్ విధించడానికి షిప్పింగ్ వనరుగా ఉన్న ప్రధాన దేశాలు అంగీకారం తెలిపాయి. దీని ప్రకారం నౌకలు విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్ డైయాక్సైడ్‌పై ఇకనుంచి కనీసం 100 డాలర్ల వంతున పన్ను విధించనున్నాయి. ఆయా దేశాల నౌకలు లక్ష్యాలను చేరలేకపోయినా, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ నెట్ జీరో ఫండ్‌కు నిధులు అందించకున్నా 2028 నుంచి ఈ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 11న లండన్‌లో 60కి పైగా దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ (ఐఎంఒ) సమావేశం జరిగింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం దీనికి గైర్హాజరు కావడం గమనార్హం. ఓడల్లో వాడే ఇంధనానికి సైతం ఈ సమావేశం పలు ప్రమాణాలను నిర్దేశించింది. మొత్తం ఉద్గారాల్లో షిప్పింగ్ వాటా 3 శాతమని ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఓడల సంఖ్యతోపాటు వాటి పరిమాణం పెరుగుతుండడం, అందుకు అనుగుణంగా ఇంధనవాడకం విపరీతంగా పెరిగిపోతుండటంతో రానున్న రోజుల్లో షిప్పింగ్ ఉద్గారాలు ఇంకా ఎక్కువవుతాయని భావిస్తున్నారు. ఐఎంఒ భేటీలో కుదిరిన ఒప్పందంపై సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగెజ్ హర్షం వెలిబుచ్చారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి షిప్పింగ్ ఆధునికీకరణకు ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ఈ బృందం అర్థవంతమైన ఏకాభిప్రాయాన్ని సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్యానికి సముద్ర నౌకా రవాణా అన్నది వెన్నుముక వంటిది. ఏటా సుమారు 12 బిలియన్ టన్నుల సరకు నౌకలపై రవాణా అవుతుందని యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) 2023 నివేదిక వెల్లడిస్తోంది. 2022లో సముద్ర వాణిజ్యం 0.4 శాతం తగ్గినా, కంటైనర్ల ద్వారా రవాణా (2024 నుంచి కంటైనర్ల రవాణా ఏటా 3% పెరుగుతోంది) చమురు, గ్యాస్ రవాణా 2022 నుంచి క్రమంగా 6%, 4.6 శాతం పెరుగుతుండడంతో 2028 నాటికి మొత్తం సముద్ర వాణిజ్యం 2.1% నుంచి 2.2% వరకు పెరుగుతుందని అంచనా. ఈ విధమైన పెరుగుదల ఇంధన వాడకానికి మరింత ఆజ్యం పోస్తుంది. గత దశాబ్దకాలంగా షిప్పింగ్ ఉద్గారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏటా విడుదలయ్యే ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ ఉద్గారాలు, 3% గ్లోబల్ గ్రీన్‌హౌస్ గ్యాస్‌తో సమానం. భారీ నౌకలు ప్రతి ట్రిప్పుకు ఎక్కువ సరకును రవాణా చేస్తుంటాయి. భారీ మొత్తంలో ఇంధనాన్ని మండిస్తుంటాయి. పనామా, లిబేరియా, మార్షల్ దీవుల్లో ఇదే పరిస్థితి. ప్రపంచం మొత్తం మీద రవాణా అయ్యే టన్నుల సరకుల్లో మూడోవంతు ఈ రేవుల ద్వారానే జరుగుతుంది. అంతే సమానంగా ఉద్గారాలు విడుదల అవుతుంటాయి. ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఒ) 2023 సవరించిన గ్రీన్‌హౌస్ గ్యాస్ (జిహెచ్‌జి)వ్యూహం (స్ట్రాటెజీ) ఆశించే లక్ష్యాలను నిర్దేశించింది. 2008 నాటి ఉద్గారాలస్థాయిలను ప్రామాణికంగా తీసుకుని 2030 నాటికి 20% నుంచి 30% వరకు ఉద్గారాలు తగ్గించాలని, 2050 నాటికి జీరో స్థాయికి చేరుకోవాలని నిర్దేశించింది. అయిననప్పటికీ, ఎలాంటి చొరవ తీసుకోకుంటే ఉద్గారాలు మరింత ఎక్కువగా పెరుగుతాయని అంచనా వేశారు. యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ గుర్తించడం బట్టి భౌగోళిక రాజకీయ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు, మళ్లీ చమురు, ఆహార ధాన్యాల నౌకల రవాణా టన్నుల భారం కన్నా మరింత దూరం సాగేలా చేస్తున్నాయి. 2023లో చమురు రవాణా దూరంతోపాటు సుదీర్ఘకాలం సాగింది. ఐఎంఒ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ నిర్ణయించిన గ్లోబల్ కార్బన్ టాక్స్ మేరకు ఆయా లక్ష్యాల నౌకలు నెట్ జీరో నిధులను అందించడం కానీ, లేదా ఉద్గారాల నియంత్రణ కానీ చేయలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఇది వాడుతున్న ఇంధన ప్రమాణాల బట్టి ఆధారపడి ఉంది. ఉద్గారాలను పూర్తిగా, లేదా కొంత స్థాయివరకు తగ్గించడానికి దోహదపడే హైడ్రోజన్, మెథనాల్, అమెనియా వంటి వాటిని ప్రోత్సహించడం అవసరం. ప్రకృతికి విరుద్ధమైన మానవ కార్యకలాపాల వల్ల భూమి వేడెక్కిపోతూనే ఉంది. 1850లో భూ ఉష్ణోగ్రతను నమోదు చేయడం మొదలైనప్పటి నుంచి అత్యుష్ణ సంవత్సరంగా 2023 రికార్డు సృష్టించగా, వెంటనే 2024 ఆ రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) గత జనవరిలో ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది. అసలు గడచిన పదేళ్లు భూమిపై గత 125000 ఏళ్లలోనే అత్యుష్ణ సంవత్సరాలని ఐరోపా, బ్రిటన్, జపాన్ దేశాల వాతావరణ సంస్థలు నిర్ధారించాయి. బొగ్గు, చమురు ఆధారిత పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటి నుంచి భూ ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తోంది. ఈ పెరుగుదల 1.5 సెల్సియస్ డిగ్రీలకు (2.7 ఫారన్ హీట్) మించకుండా చూడాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ ఈ ఏడాది భూ ఉష్ణోగ్రత ఆ పరిమితిని మించి 1.6 సెల్సియస్ డిగ్రీలకు పెరిగిందని ఐరోపా కమిషన్‌కు చెందిన కొపెర్నికస్ వాతావరణ విభాగం తెలిపింది. జపాన్ ఈ పెరుగుదలను 1.57 డిగ్రీలుగా, బ్రిటన్ 1.53 డిగ్రీలుగా లెక్కగట్టాయి. వాతావరణ మార్పుల వల్ల వరదలు, తుపానులు, అనావృష్టి తలెత్తి గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 14,000 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్లనే వాతావరణంలో కర్బనం పెరిగి ఉష్ణోగ్రతను పెంచుతోంది. పారిశ్రామిక విప్లవంనుంచి సంపన్న ఐరోపా, అమెరికా ఖండ దేశాలు శిలాజ ఇంధనాలను మండించడం ద్వారా ప్రపంచానికి 170 లక్షల కోట్ల డాలర్ల నష్టం కలిగించాయి. ఈ నష్టాలను అధిగమించడానికి వర్ధమాన దేశాలకు లక్షల కోట్ల డాలర్ల సహాయం చేయాల్సిన సంపన్న దేశాలు కేవలం 30,000 కోట్ల డాలర్లను అదీ 2035 కల్లా విదిలిస్తామని ప్రతిపాదించాయి. భూగోళం వేడెక్కడ మనేది కఠోరమైన వాస్తవమని డబ్లుఎంఒ తాజా నివేదిక మరోసారి రుజువు చేస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భూతాపం పెరగడం మాతాశిశు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. వేడి ఎక్కువగా ఉండే రోజుల సంఖ్య పెరుగుతున్నందున నెలలు నిండక ముందే శిశు జననాలు సంభవిస్తున్నాయి. తల్లులకు 4 మధ్య ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. 20202కాలంలో 247 దేశాలు, 940 నగరాల్లో అధిక వేడిరోజులు రెట్టింపు అయ్యాయని తేల్చారు. గడిచిన అయిదేళ్లలో భారత్‌లో గర్భిణులకు ప్రమాదకరమైన రీతిలో జాతీయ స్థాయిలో ఏటా సగటున ఆరు అదనపు అత్యుష్ణ రోజులు నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి.

# విపక్షరాష్ట్రాల్లో ఇడి దూకుడు




సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై మరోసారి సుప్రీం కోర్టు ఆగ్రహించడం తాజాగా చర్చనీయాంశమైంది. గత ఏడాది మే నెలలో ఇడి దర్యాప్తు తీరుపై ఎన్నో ఫిర్యాదులు రావడంతో సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించింది. దర్యాప్తుల సమయంలో భయోత్పాత వాతావరణం సృష్టించవద్దని హెచ్చరించింది. అయినాసరే ఇడి వ్యవహారంలో మార్పు రాలేదన్న విమర్శలు వస్తున్నాయి. చాలా కేసుల దర్యాప్తులో ఇడి తనకున్న అసాధారణ అధికారాలతో దూకుడుగా వ్యవహరిస్తోందని గత కొన్ని సంఘటనల బట్టి తెలుస్తోంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వం నిర్వహించే మద్యం రిటైలర్ టాస్మాక్‌లో రూ. 1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈ ఏడాది మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఇడి సోదాలు జరిపింది. ఇటీవల మళ్లీ మేనెల ఆరంభంలో టాస్మాక్ అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. ఈ అవకతవకలపై రాష్ట్రపోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇడి సోదాలు చేస్తోందని, టాస్మాక్ అధికారులను హింసిస్తోందని తమిళనాడు ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో తాజాగా సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఇడి తీరును తప్పుపట్టింది. సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఆగ్రహించింది. కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వరకు చెందిన విద్యాసంస్థల్లో కూడా బుధవారం (మే 21) ఇడి సోదాలు చేపట్టడం కలకలం రేపుతోంది. ఈ విద్యాసంస్థలు గత కొన్నేళ్లుగా పేరుపొందినవే. కర్ణాటక ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతుండడంతో బిజెపి కన్నెర్రనౌతోందని అందుకే దర్యాప్తు సంస్థలతో భయపెడుతోందని, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తోందని కర్ణాటక కాంగ్రెస్ తీవ్రంగా విమర్శిస్తోంది. కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసులో కర్ణాటక హోం మంత్రి విద్యాసంస్థలకు, రన్యారావుకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఇడి అనుమానిస్తోంది. ఈ దాడులు వెనుక కేంద్రంలోని అధికార బిజెపి ప్రేరణ ఉందని కర్ణాటక కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది రూ. 2000 కోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులో అప్పటి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్‌ను ఇరికించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రయత్నిస్తోందని, దీనికోసం తమ రాష్ట్రంలో భయానక పరిస్థితి కల్పిస్తోందంటూ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విధి నిర్వహణలో భాగంగా అవతలివారిని బెదిరించి భయపెట్టడం మంచిది కాదని సుప్రీం కోర్టు ఇడిని మందలించింది. మనీలాండరింగ్ చట్టం లోని కొన్ని నిబంధనలను కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం చేసి భయపెట్టడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందని కూడా చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చింది. ఆనాడు చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం సాగడం రాజకీయంగా అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికే అన్న అపవాదు కూడా వచ్చింది. కర్ణాటకలో వాల్మీకి ఎస్‌టి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుక్కునేలా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేరును తెరపైకి తీసుకురాడానికి కూడా ఇడి పావులు కదిపినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు ఇడి అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని కర్ణాటక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ కల్లేష్ బి ఫిర్యాదు చేయడంతో ఇడి అధికారులు ఇద్దరిపై కర్ణాటకలో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అయితే కర్ణాటక హైకోర్టు దీనిపై స్టే విధించడంతో ఈ వ్యవహారానికి బ్రేకు పడింది. నగదు అక్రమ చలామణీ జరిగిందని ఇడి పెడుతున్న కేసుల్లో చాలావరకు శిక్షలు పడడం తక్కువే అని సుప్రీం కోర్టు కూడా గతంలో వ్యాఖ్యానించింది. పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించడంలో ఇడి వైఫల్యాన్ని సుప్రీం ఎత్తి చూపింది. 2014 2024 మధ్య కాలంలో నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద 5297 కేసులు పెట్టగా, వాటిలో 40 కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయని కేంద్ర హోంశాఖ గత ఏడాది వెల్లడించిన సంగతి ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్‌పై సోదాలు కూడా దూకుడుగా హద్దులు దాటుతుండడమే అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడం ఇడి విశ్వసనీయతకు తీరని కళంకం. టాస్మాక్‌పై జరుగుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తుపై సుప్రీం స్టే విధించడం ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అంశం. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బిజెపి కుట్రల్లో ఇదో భాగంగా తమిళనాడు ప్రభుత్వం విమర్శిస్తోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ వంటి దర్యాప్తు సంస్థల దాడులు విచక్షణా రహితంగా సాగుతున్నాయన్న అపవాదు చాలా కాలంగా వినిపిస్తోంది. కేంద్రం కనుసన్నల్లోనే ఇవి పనిచేస్తున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న విపక్ష పాలిత రాష్ట్రాల పైనే ఈ దాడులు టార్గెట్ చేసుకుంటున్నాయి. ఐ

ఆయా వర్గాల ఆస్తులు జప్తు అవుతన్నాయి. ఇడి జప్తు చేసిన ఆస్తుల పరిస్థితి పరిశీలిస్తే యుపిఎ ప్రభుత్వ హయాంలో 200405 నుంచి 201314 వరకు కేవలం రూ. 5346 కోట్ల ఆస్తులే జప్తు కాగా, మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2014 నుంచి 2022 వరకు రూ. 99,356 కోట్ల విలువైన ఆస్తులు జప్తు అయ్యాయి. అలాగే ఇడి కేసుల్లో 95% ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో నమోదైనవే.

# SPORTS

## భారత టెస్ట్ క్రికెట్‌లో నూతన శకం ప్రారంభం..
# ఇంగ్లండ్ టూర్‌కు జట్టు ప్రకటన



రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత భారత టెస్ట్ క్రికెట్ లో కొత్త శకం మొదలైంది. జూన్ 20 నుం చి ఇంగ్లండ్ టూర్ తో టూర్ ప్రా రం భం కానుంది.టెస్ట్ సిరీస్ కోసం బీసీసీఐ శనివారం జట్టును ప్రక టించింది.

**కొత్త కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు.**

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ నాలుగో ఎడిషన్‌ను భారత్ యువ జట్టుతో ప్రారంభించనుంది. టెస్టుల నుంచి కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత..

యువ శుభ్‌మన్ గిల్ కొత్త కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అదే సమయంలో రిషబ్ పంత్‌ని వైస్ కెప్టెన్‌గా నియమించారు. విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్ తర్వాత అతని స్థానంలో సాయి సుదర్శన్ ఎంపికయ్యాడు. భారత జట్టులో అనుభవజ్ఞులైన ఇద్దరు ఆటగాళ్లు రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా మాత్రమే.

అంతేకాకుండా కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్‌లకు కూడా జట్టులో చోటు కల్పించారు. జస్ప్రీత్ బుమ్రా ఫాస్ట్ బౌలింగ్ అటాక్‌కు నాయకత్వం వహిస్తాడు. అర్ష్‌దీప్ సింగ్ తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. వీరిద్దరితో పాటు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, శార్దూల్ ఠాకూర్‌లు కూడా చోటు దక్కించుకున్నారు.

**ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టు**

**శుభమన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీం ద్ర జడేజా, ధ్రువ్ జురైల్, వా షింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్.**

## మరో 100 ఏళ్లలో కూడా చెక్కుచెదరని రోహిత్ మాన్‌స్టర్ రికార్డు.. ఏంటో తెలుసా?



: క్రికెట్ చరిత్రలో ఎందరో దిగ్గజ బ్యాట్స్‌మెన్‌లు ఉన్నారు. కానీ, వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ సృష్టించిన ఒక రికార్డు మాత్రం అరుదైనది. ఇది మరో 100 ఏళ్ల వరకు బ్రేక్ చేయడం సాధ్యం కాదనిపిస్తోంది. ఆ రికార్డ్ ఏంటో తెలిస్తే, మీరు కూడా ఇదే మాట అంటారు. రోహిత్ బద్దలవ్వని రికార్డ్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.. అదే మూడు డబుల్ సెంచరీలు. ఈ ఘనతను సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. ఈ రికార్డును బద్దలు కొట్టడం దాదాపు అసాధ్యమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఆ మూడు అద్భుత ఇన్నింగ్స్‌లు ఎప్పుడొచ్చాయో తెలుసా?**

209 %జం% ఆస్ట్రేలియా (బెంగుళూరు, 2013): రోహిత్ శర్మ తన వన్డే కెరీర్‌లో మొట్టమొదటి డబుల్ సెంచరీని ఆస్ట్రేలియాపై బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతను 158 బంతుల్లో 209 పరుగులు చేశాడు. ఇందులో 12 ఫోర్లు, 16 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఇది అతని కెరీర్‌లో ఒక మలుపు తిప్పిన ఇన్నింగ్స్. 264 %జం% శ్రీలంక (కోల్‌కతా, 2014): ఇది రోహిత్ శర్మ సాధించిన అత్యధిక వ్యక్తిగత వన్డే స్కోరు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో శ్రీలంకపై అతను 173 బంతుల్లో 264 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో 33 ఫోర్లు, 9 సిక్సర్లు ఉన్నాయి. వన్డే క్రికెట్ చరిత్రలోనే ఒక బ్యాట్స్‌మెన్ చేసిన అత్యధిక స్కోరు ఇది. ఈ రికార్డు కూడా ఇప్పట్లో బద్దలవడం కష్టం. 208 %జం% శ్రీలంక (మొహాలీ, 2017):లి మొహాలీలో శ్రీలంకపైనే రోహిత్ శర్మ తన మూడవ డబుల్ సెంచరీని సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతను 153 బంతుల్లో 208 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 13 ఫోర్లు, 12 సిక్సర్లు ఉన్నాయి. తన వివాహ వార్షికోత్సవం రోజున ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడటం విశేషం.

**రోహిత్ ఈ రికార్డ్ ఎందుకు అసాధ్యం?**

వన్డే క్రికెట్ ఫార్మాట్‌లో 50 ఓవర్లలో ఒక బ్యాట్స్‌మెన్ డబుల్ సెంచరీ సాధించడమే ఒక అద్భుతం. అలాంటిది మూడు సార్లు డబుల్ సెంచరీలు నమోదు చేయడం అంటే అది మామూలు విషయం కాదు. రోహిత్ శర్మ అద్భుతమైన టైమింగ్, సిక్సర్లు బాదే సామర్థ్యం, సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడే ఓపిక ఈ రికార్డుకు కారణంగా నిలిచింది. ప్రస్తుత క్రికెట్ ప్రపంచంలో అనేక మంది పవర్‌హిట్టర్లు ఉన్నప్పటికీ, నిలకడగా ఈ స్థాయిలో పరుగులు చేయడం, పెద్ద స్కోర్లుగా మలచడం చాలా కష్టం. క్రికెట్‌లో టీ20 ఫార్మాట్ ప్రభావం పెరగడంతో ఆటగాళ్లు వేగంగా పరుగుధించలు సాడాని%అ౧%కి మొగ్గు చూపుతున్నారు. దీంతో ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సేపు క్రీజ్‌లో ఉండి డబుల్ సెంచరీ చేయడం అనేది చాలా అరుదైపోయింది. రోహిత్ శర్మ వన్డేల్లో సాధించిన ఈ మూడు డబుల్ సెంచరీల రికార్డు, అతనిని "హిట్‌మ్యాన్"గా మార్చడమే కాకుండా, క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన స్థానాన్ని కల్పించింది. ఈ రికార్డును బద్దలు కొట్టడానికి భవిష్యత్తులో ఏ బ్యాట్స్‌మెన్ వచ్చినా, అతనికి ఒక గొప్ప సవాలు ఎదురవడం ఖాయం.

## ఆడు మగాడ్రా బుజ్జీ..
## ఫాస్టెస్ట్ సెంచరీతో ఇంగ్లీషోళ్లనే గజగజ వణికించేశాడుగా..

: క్రికెట్ ప్రపంచంలో ఓ జింబాబ్వే ప్లేయర్ సంచలనం సృష్టించాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతోన్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే యువ బ్యాటర్ బ్రయాన్ బెన్నెట్ అద్భుత ఇన్నింగ్స్‌తో 139 పరుగులు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ట్రెంట్ బ్రిడ్జ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో బెన్నెట్ చూపిన ప్రతిభ, అతని దేశానికి ఒక గొప్ప గుర్తింపును తెచ్చింది. ఇంగ్లాండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 565 పరుగుల భారీ స్కోరును డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన జింబాబ్వేకు బ్యాటింగ్ సవాలుగా మారింది. ఈ సమయంలో, బ్రయాన్ బెన్నెట్ క్రీజ్‌లోకి వచ్చి ధైర్యంగా, దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అతను కేవలం 143 బంతుల్లో 139 పరుగులు సాధించాడు. ఇందులో 26 ఫోర్లు ఉన్నాయి. అతని బ్యాటింగ్ స్ట్రైక్ రేట్ 97.20గా ఉండటం విశేషం. ఇది టెస్ట్ క్రికెట్‌లో జింబాబ్వే బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన శతకం (97 బంతుల్లో సెంచరీ)గా మారింది. అతను తన ఇన్నింగ్స్‌లో పలు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (42)తో కలిసి 65 పరుగుల భాగస్వామ్యాన్ని, ఆ తర్వాత సీన్ విలియమ్స్ (25)తో కలిసి 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ పరుగులు జింబాబ్వే ఇన్నింగ్స్‌కు ఒక మంచి పునాది వేశాయి. అయితే, బెన్నెట్ అద్భుత ఇన్నింగ్స్ ఆడినప్పటికీ, జింబాబ్వే జట్టు 265 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లాండ్ తమ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో జింబాబ్వేను ఫాలో ఆన్ ఆడిస్తోంది. రెండవ ఇన్నింగ్స్‌లో బెన్నెట్ కేవలం 1 పరుగు మాత్రమే చేసి నిరాశపరిచాడు. ఈ మ్యాచ్‌లో బెన్నెట్ ప్రదర్శన అతని కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో అతని రెండవ శతకం. అలాగే ఇదే అతని అత్యధిక స్కోరుగా నిలిచింది. అతని ఈ ఫియర్ లెస్ బ్యాటింగ్, జింబాబ్వే క్రికెట్‌కు ఒక ఆశాకిరణంలా నిలిచింది. బ్రయాన్ బెన్నెట్ భవిష్యత్తులో జింబాబ్వే క్రికెట్‌లో ఒక కీలక ఆటగాడిగా మారతాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఇంగ్లాండ్ విజయానికి 8 వికెట్లు..

జింబాబ్వే 265 పరుగులకు ఆలౌట్ అయిన తర్వాత ఇంగ్లాండ్ 300 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఆ తర్వాత జింబాబ్వేకు ఫాలో ఆన్ ఇచ్చింది. రెండో రోజు బ్యాటింగ్ ముగిసే సమయానికి జింబాబ్వే 30 పరుగులు చేసి 2 వికెట్లు కోల్పోయి ఆడుతోంది. ఇంగ్లాండ్ గెలవాలంటే 8 వికెట్లు అవసరం.

మ్యాచ్ సంక్షిప్త స్కోరు:

ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్: 565/6 డిక్లేర్డ్

జింబాబ్వే మొదటి ఇన్నింగ్స్: 265 (బ్రయాన్ బెన్నెట్ 139)

జింబాబ్వే రెండవ ఇన్నింగ్స్ (ఫాలో ఆన్): 30/2 (రెండవ రోజు ఆట ముగిసే సమయానికి)



## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ.. ప్రపంచంలోనే తొలి ప్లేయర్‌గా

**టీమిండియా స్టార్ బ్యాటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లెజెండ్ విరాట్ కోహ్లి అరుదైన ఘనత సాధించాడు. టీ20 క్రికెట్‌లో ఒకే జట్టు తరపున 800 ఫోర్లు కొట్టిన తొలి ఆటగాడిగా విరాట్ వరల్డ్ రికార్డు సృష్టించాడు.**

**ఐపీఎల్ 2025 లో భాగంగా శుక్రవారం లక్నో వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లి ఈ ఘనత అందుకున్నాడు. కోహ్లి ఇప్పటివరకు ఆర్సీబీ తరపున 801 ఫోర్లు బాదాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లి 25 బంతులు ఎదుర్కొని ఏడు ఫోర్లు, ఓ సిక్సర్ సాయంతో 43 పరుగులు చేశాడు. ఇక ఈ రేర్ ఫీట్ సాధించిన జాబితాలో ఇం?గ్లండ్ ఆటగాడు జేమ్స్ విన్స్(694) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. విన్స్ హాంప్‌షైర్ క్రికెట్ క్లబ్ తరపున ఆడి ఈ ఫీట్ నమోదు చేశాడు.**

**టీ20ల్లో ఒకే జట్టు తరుపున అత్యధిక ఫోర్లు కొట్టిన ఆటగాళ్లు వీరే..**

**విరాట్ కోహ్లి (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు) %-% 801 ఫోర్లు**

**జేమ్స్ విన్స్ (హాంప్‌షైర్) - 694 ఫోర్లు**

**అలెక్స్ హేల్స్ (నాటింగ్‌హామ్‌షైర్) - 563 ఫోర్లు**

**రోహిత్ శర్మ (ముంబై ఇండియన్స్) - 550 ఫోర్లు**

**ల్యూక్ రైట్ (సస్సెక్స్) - 529 ఫోర్లు**

**ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. ఆర్సీబీకి సన్‌రైజర్స్ ఝులక్ ఇచ్చింది. బెంగళూరుపై 45 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఘన విజయం సాధించింది.**

**తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు సాధించింది. ఇషాన్ కిషన్ (94 నాటౌ ట్‌బీ 48 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా.. అభిషేక్ శర్మ (34బీ 17 బం తుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లు), అనికేత్ వర్మ(26బీ 9 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లు), క్లాసెన్(24) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం లక్ష్య చేధనలో ఆర్సీబీ 19.5 ఓవర్లలో 189 పరుగులకే ఆలౌటైంది.**



## ఇది కదా సక్సెస్ అంటే.. 25 ఏళ్లకే టీమిండియా కెప్టెన్‌గా

భారత టెస్టు క్రికెట్ జట్టుకు కొత్త నాయకుడొచ్చాడు. రోహిత్ శర్మ వారసుడు ఎవరో తేలిపోయింది. టీమిండియా టెస్టు కెప్టెన్‌గా యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. అందరూ ఊహించినట్టే గిల్‌కే భారత జట్టు పగ్గాలను బీసీసీఐ అప్పగించింది. ఈ విషయాన్ని బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం అధికారికంగా ప్రకటించింది. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ పంజాబీ క్రికెటర్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశామని ఛీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌పేర్కొన్నాడు. ఇక అరంగేట్రం చేసిన ఐదేళ్లలోనే భారత జట్టు కెప్టెన్‌గా ఎదిగిన గిల్‌పై సర్వాత్ర ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇది కదా సక్సెస్ అంటూ గిల్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. గిల్ 2020లో ఆస్ట్రేలియాపై తన టెస్టు అరంగేట్రం చేశాడు.




**25 ఏళ్ల వయస్సులోనే?**

భారత టెస్టు జట్టుకు 17 ఏళ్ల తర్వాత యువ కెప్టెన్ వచ్చాడు. 2008లో దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే నుంచి భారత టెస్టు జట్టు పగ్గాలను ఎంఎస్ ధోని చేపట్టాడు. అప్పటికి ధోని వయస్సు 27 ఏళ్లు. ఆ తర్వాత 8 ఏళ్ల పాటు భారత జట్టును మిస్టర్ కూల్ నడిపించాడు. అనంతరం 2014 డిసెంబరులో ధోనీ నుంచి కోహ్లికి టెస్టు కెప్టెన్సీ దక్కింది. అప్పటికి విరాట్‌కు 27 ఏళు ,,. కోహ్లి సరిగ్గా ఏడేళ్ల పాటు రెడ్‌బాల్ ఫార్మాట్‌లో భారత జట్టుకు సారథ్యం వహించాడు. కోహ్లి నాయకత్వంలోనే తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌ను భారత్ సొంతం చేసుకుంది. 2021 ఆఖరిలో కోహ్లి టెస్టు కెప్టెన్సీకి రాజీనామా చేయడంతో అతడి వారసుడిగా రోహిత్ శర్మ బాధ్యతలు చేపట్టాడు. రోహిత్ శర్మ టెస్టు కెప్టెన్‌గా ఎంపికయ్యేటప్పటికి అతడి వయస్సు 34 ఏళ్లు. ఇప్పుడు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో శుబ్‌మన్ గిల్ 25 ఏళ్ల వయస్సులోనే కొత్త టెస్టు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. దీంతో దిగ్గజ కెప్టెన్లు ధోని, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల కంటే అతి తక్కువ వయస్సులోనే టీమిండియా నాయకుడిగా ఎంపికై గిల్ చరిత్ర సష్టించాడు. ఓవరాల్‌గా భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా ఎంపికైన ఐదవ అతి పిన్న వయస్కుడిగా గిల్ నిలిచాడు. గిల్ ప్రస్తుత వయస్సు 25 సంవత్సరాల 285 రోజులు. ఈ అరుదైన ఫీట్ సాధించిన జాబితాలో మాజీ కెప్టెన్ మన్సూర్ అలీ ఖాన్ పటౌడి (21 సంవత్సరాల 77 రోజులు) అగ్రస్థానంలో ఉన్నాడు. గిల్ ఇప్పటివరకు 32 టెస్టులు ఆడి 35.06 సగటుతో 1893 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లలో 7 హాఫ్ సెంచరీలు, ఐదు శతకాలు ఉన్నాయి.

**టెస్టుల్లో అతి పిన్న వయస్కులైన భారత కెప్టెన్లు వీరే..**

మన్సూర్ అలీ ఖాన్ పటౌడి (21 సంవత్సరాల, 77 రోజులు)

సచిన్ టెండూల్కర్ -(23 సంవత్సరాల, 169 రోజులు). కపిల్ దేవ్ (24 సంవత్సరాల, 48 రోజులు). రవి శాస్త్రి (25 సంవత్సరాల, 229 రోజులు). శుబ్‌మాన్ గిల్ (25 సంవత్సరాల, 285 రోజులు)


EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com